

పెదగంజాం తీరంలో విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు



తీరంలో నిమజ్జనాలకు బారులు తీరిన విగ్రహాలు



పూజలు చేస్తున్న మహిళలు

బై.. బై.. గణేశా..

ఘనంగా వినాయక నిమజ్జనాలు
తీరప్రాంతానికి తరలిన వందలాది విగ్రహాలు
భక్తులతో కోలాహలం



పామూరులో బారులు తీరిన విగ్రహాలు

జిల్లావ్యాప్తంగా ఆదివారం వినాయక నిమజ్జనాలు ఉత్సాహంగా జరిగాయి. ఐదో రోజు కావడంతో భక్తులు గణనాథులకు పూజలు చేసిన అనంతరం ఊరేగింపుగా తీసుకెళ్లి గంగమ్మ ఒడికి చేర్చారు. ఈ సందర్భంగా యువతీయువకులు గణపతిబొప్పా మోరియా అంటూ గులాములు చల్లుకున్నారు. మేళతాళాలు, దప్పు వాయిద్యాలు, డీజే సౌండ్ పాటలకు అనుగుణంగా చిందులు వేస్తూ సందడి చేశారు. పెద్దసంఖ్యలో విగ్రహాలు, వాటితో తరలివచ్చిన భక్తులతో తీరప్రాంతాలైన కొత్తపట్నం, మడనూరు, ఈతముక్కల, పాకల తదితర ప్రాంతాల్లో కోలాహలం నెలకొంది. కొత్తపట్నం బీచ్ వద్ద పండుగ వాతావరణం కనిపించింది. అక్కడ వందల సంఖ్యలో విగ్రహాలను నిమజ్జనం చేశారు. - ఆంధ్రజ్యోతి, ఒంగోలు



బుల్లి విగ్రహాలతో సందడి



కొత్తపట్నం సముద్ర తీరంలో పోటెత్తిన భక్తులు



ఒంగోలు టీడీపీ ఆఫీసులో కోలాటం

జీజీహెచ్‌కి అవినీతి రోగం!

పేదల పెద్దాసుపత్రిలో 'సంపూర్ణ'ంగా వసూళ్లు

- కోరిన డ్యూటీ కోసం డబ్బులు డిమాండ్
- నర్సింగ్ విభాగంలో ఇష్టారాజ్యం
- విషయం తెలిసినా ఉన్నతాధికారులు మౌనం

ఒంగోలులోని పేదల ప్రభుత్వ ఆసుపత్రి (జీజీహెచ్)లో అవినీతి కంపు కొడుతోంది. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వచ్చే రోగుల సేవలను పక్కన పెట్టి విధుల్లో వెసులుబాటు కోసం నర్సింగ్ సిబ్బంది పాకులాడుతున్నారు. ముఖ్యంగా వీరికి డ్యూటీల కేటాయింపుల్లో సంబంధిత విభాగం అధికారిణి చేతివాటం చూపుతున్నారు. దీంతో రోగుల సేవలవైపు కన్నెత్తి చూసేవారే కరువయ్యారు. ఏడాదిగా ఈ బాగోతం నడుస్తున్నా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు. పైగా అవినీతి రోగం మరింత ముదిరి ఇతర విభాగాలకూ విస్తరిస్తోంది.



ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో 700 మంది వరకు నర్సులు పనిచేస్తున్నారు. వారికి నెలకు ఒకసారి రోస్టర్ ప్రకారం డ్యూటీలు వేయాల్సి ఉంది. నిబంధనల మేరకు మూడు షిఫ్ట్‌లలో విధులు కేటాయిస్తారు. ఉదయం 8 నుంచి 2, మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8, రాత్రి 8నుంచి ఉదయం 8 గంటల వరకు నర్సులు పనిచేస్తారు. అయితే నెలకు ఒక షిఫ్ట్ చొప్పున వారికి పగలు, మధ్యాహ్నం, రాత్రి ఇలా మారే క్రమంలో మంచి డ్యూటీ కోసం వసూళ్ల పర్వం నడుస్తోంది. కొంతమంది రాత్రి విధులకు మొఖం చాటేస్తూ పగలు డ్యూటీ కోసం పోటీపడుతున్నారు. మరికొందరు పగటి వేళ కంటే రాత్రిపూట పని తక్కువగా ఉంటుందన్న భావనలో ఆ సమయంలో విధులు నిర్వర్తించేందుకు ఆసక్తి చూపుతున్నారు. వీరంతా తమకు అనుకూలమైన షిఫ్ట్ కోసం నర్సింగ్ విభాగాధిపతిని ప్రసన్నం చేసుకుంటున్నారు. అందుకోసం అమ్యామ్యాలు కూడా సమర్పిస్తున్నారు. వైద్యారోగ్య శాఖ, జీజీహెచ్ నిబంధనల ప్రకారం నెల చివర 31వ తేదీ ఎవరికి ఏ వార్డు, ఏ సమయంలో అనేది నోటీసు బోర్డులో ప్రచురించాల్సి ఉంది. అయితే ఇక్కడ మాత్రం అధికారిణి అడిగినంత ఇచ్చేవరకు డ్యూటీ చార్ట్ ప్రకటించరు.

తాము కోరిన సమయంలో, తాము కోరిన వార్డులకు వెళ్లేందుకు ఒక్కో నర్సు నెలకు రూ.15 వేలకుపైగా సమర్పిస్తున్నారంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. మెడికల్ గ్రౌండ్స్ కింద ఉదయం 9 నుంచి 4 గంటల వరకు కొంతమందికి అవకాశం ఉంది. అయితే డబ్బులు ఇచ్చిన వారికి ఆ సమయాల్లో కూడా డ్యూటీలు వేస్తున్నట్లు సమాచారం. ప్రతినెలా 100 మంది వరకు తమ వెసులుబాటు కోసం డబ్బులు చెల్లించుకుని మరీ విధుల సమయాల్లో మార్పులు పొందుతున్నారు. మిగతావారు మాత్రం నిబంధనల ప్రకారం రోస్టర్ విధానాల మేరకు డ్యూటీలు వేయాలని,

అంతా ఇష్టారాజ్యం



తాము డబ్బులు చెల్లించలేమని చెబుతున్నట్లు తెలిసింది. అయితే వారిపై ఆ విభాగాధిపతి వ్యక్తిగతంగా దూషణలు, కక్షసాధింపులు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. నర్సింగ్ సూపరింటెండెంట్‌పై జీజీహెచ్‌లో పనిచేస్తున్న ఓ నర్సు ఒంగోలు వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

ఏడాది కాలంగా ఇదే తంతు

ఏడాదిగా నర్సింగ్ విభాగంలో అవినీతి బాగోతం నడుస్తున్నట్లు కొందరు నర్సులు వాపోతున్నారు. నర్సింగ్ విభాగంలో జరుగుతున్న అవకతవకలు ఆసుపత్రిలోని కొందరు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినా చర్యలు తీసుకోవడంలో వెనకడుగు వేయడంపై విమర్శలతోపాటు పలు అనుమానాలు వ్యక్తమవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి విచారణ చేయిస్తే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఆదిశగా చర్యలు తీసుకొని డ్యూటీల కేటాయింపులో పారదర్శకత పాటించాలని పలువురు నర్సులు కోరుతున్నారు.

గుమస్తా గోల్‌మాల్!

పొగాకు వ్యాపారి వద్ద పనిచేస్తూ రూ.20కోట్లు కొట్టేసిన వైనం

- అతని ఖాతాల నుంచి రూ.7కోట్లు కాజేసిన సైబర్ నేరగాళ్లు
- ఆ మొత్తం భర్తీ చేసుకునేందుకు మరింత నొక్కుడు
- అనుమానంతో వ్యాపారి ఆరా తీయగా మోసం బయటకు..
- ఎస్పీకి ఫిర్యాదు.. గోప్యంగా విచారిస్తున్న పోలీసులు

ఒంగోలు క్రైం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పొగాకు వ్యాపారి వద్ద గుమస్తాగా పనిచేసే వ్యక్తి రూ.20 కోట్లు కొట్టేశాడు. 25 ఏళ్ల నుంచి నమ్మకంగా ఉంటూ యజమానికే టోకరా వేశాడు. ఈ విషయమై బాధిత వ్యాపారి ఎస్పీకి ఫిర్యాదు చేయడంతో ప్రత్యేక పోలీసు బృందాన్ని రంగంలోకి దించారు. వారం రోజులుగా ఆ బృందం అత్యంత గోప్యంగా విచారిస్తోంది. వివరాల్లోకి వెళితే.. టంగుటూరు ప్రాంతానికి చెందిన ఓ పొగాకు వ్యాపారి రూ.కోట్లలో టర్నోవర్ చేస్తుంటారు. ఆయన వద్ద 25 సంవత్సరాలుగా ఓ వ్యక్తి గుమస్తాగా పనిచేస్తున్నాడు. అంతా తానై పనులు చక్కబెడుతూ నమ్మకం కుదుర్చుకున్నాడు. ఆ వ్యాపారి నగదు లావాదేవీలన్నీ ఆ గుమస్తానే చూస్తున్నాడు. అవకాశాన్ని ఆసరా చేసుకొన్న ఆ గుమస్తా చేతివాటం చూపడం ప్రారంభించాడు. వ్యాపారికి వచ్చే ఆదాయంలో కొంత నొక్కేయడం ప్రారంభించాడు. ఇలా పెద్దమొత్తంలోనే కాజేశాడు.

గుమస్తా ఖాతాలపై సైబర్ నేరగాళ్ల కన్ను

గుమస్తా బ్యాంక్ ఖాతాలపై సైబర్ నేరగాళ్ల కన్నేశారు. వాటి నుంచి సుమారు రూ.6 నుంచి ఏడు కోట్లు కొట్టేసినట్లు తెలిసింది. దాన్ని భర్తీ చేసుకునేందుకు సదరు గుమస్తా పొగాకు వ్యాపారంలో వచ్చే డబ్బును ఎక్కువ కాజేయడం ప్రారంభించాడు. దీంతో వ్యాపారికి అనుమానం వచ్చింది. కొంత సమాచారం, ఆధారాలను కూడా సేకరించుకున్నాడు. కొద్దిరోజుల క్రితం ఎస్పీ దామోదర్‌ను ఆశ్రయించాడు. దీంతో ఎస్పీ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి అత్యంత గోప్యంగా విచారణ చేస్తున్నారు. సుమారు రూ.20 కోట్లకు పైన పొగాకు వ్యాపారి డబ్బును సదరు గుమస్తా కాజేసినట్లు తెలుస్తోంది.



గుమస్తా వద్ద అప్పులు తీసుకున్నవారిపై ఆరా

గుమస్తా తన యజమాని వద్ద కాజేసిన నగదును కొంత మందికి రూ.లక్షల్లో అప్పులు ఇచ్చినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. అప్పు తీసుకున్న వారికి కూడా వ్యవహారం తెలిసి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. దీన్ని కూడా నేరంగా పరిగణించి అప్పులు తీసుకున్న వారిపై దర్యాప్తు బృందం దృష్టి సారించింది. పొగాకు వ్యాపారి వద్ద పనిచేస్తున్న గుమస్తాను పోలీసు ప్రత్యేక బృందం అత్యంత గోప్యంగా విచారిస్తున్నట్లు తెలుస్తోంది. యజమాని వద్ద కొట్టేసిన నగదును ఎక్కడ దాచిపెట్టాడు? ఎవరికి అప్పులు ఇచ్చాడు? అసలు మొత్తం ఎంత తస్కరించాడు? అన్న విషయాలను లోతుగా విచారిస్తున్నారు.

రైస్ కార్డుల కోసం 10,879 దరఖాస్తులు

పేర్ల నమోదుకు 68,299

మొత్తం దరఖాస్తుల్లో 64,185 ఆమోదం.. 13,345 తిరస్కరణ

నేటి నుంచి రేషన్ పంపిణీ

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కొత్త రైస్ కార్డులు, ప్రస్తుతం ఉన్న వాటిలో చేర్పులు, మార్పుల కోసం భారీగా దరఖాస్తులు అందాయి. మొత్తం 99,222 మంది దరఖాస్తు చేసుకున్నారు. వాటిని తహసీల్దార్లు విచారించి అర్హత ఉన్న 64,185 దరఖాస్తులను ఆమోదించారు. 13,345 తిరస్కరించారు. వాటిలో కొత్త రైస్ కార్డుల కోసం 10,879 దరఖాస్తులు అందగా 6,972 ఆమోదించారు. జిల్లాలో అత్యధికంగా ప్రస్తుతం ఉన్న రైస్ కార్డుల్లో అదనంగా పేర్ల నమోదు కోసం 68,299 దరఖాస్తులు అధికారులకు అందాయి. విచారణ అనంతరం వాటిలో 41,497 ఆమోదించారు. 7,329 తిరస్కరించారు మిగిలిన వాటిపై విచారణ చేయాల్సి ఉంది. ఆధార్ నమోదు కోసం 1,277, ప్రస్తుతం ఉన్న రైస్ కార్డుల్లో పేర్ల తొలగింపు కోసం 1,481, రేషన్ కార్డులను అప్పగించేందుకు 46, తప్పుల సవరణ కోసం 1,277, అడ్రస్‌ల మార్పు కోరుతూ 2,178 దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటికే ఆమోదించిన దరఖాస్తులకు ఈ నెల నుంచే రేషన్ ఇవ్వనున్నట్లు సమాచారం.

నేటి నుంచి రేషన్ పంపిణీ

కార్డుదారులకు సోమవారం నుంచి రేషన్ పంపిణీ ప్రారంభం కానుంది. జిల్లాలో 1,392 రేషన్ షాపుల పరిధిలో 6.61 లక్షల కార్డులు ఉన్నాయి. ఈ నెలలో బియ్యం, పంచదార పంపిణీ చేయనున్నారు.

సార్లొస్తున్నారు..

- బడికి అడుగు దూరంలో యువ టీచర్లు
- డీఎస్సీ నియామకాల్లో కీలక ఘట్టం పూర్తి

ఒంగోలు విద్య, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికైన వారు బడిలో అడుగు పెట్టేందుకు అడుగు దూరంలో నిలిచారు. నియామకాలకు సంబంధించి కీలక ఘట్టం ముగిసింది. సర్టిఫికెట్ల పరిశీలనలో అన్నీ ఓకే కావడంతో అభ్యర్థులు ఊపిరి పీల్చుకున్నారు. సర్టిఫికెట్ల పరిశీలనకు పిలిచిన వారిలో ఒకరు ఐదు, మరికొందరు రెండు, మూడు పోస్టులకు అర్హత సాధించారు. వీరిని ఒక పోస్టుకు పరిమితం చేసి మిగిలిన వాటికి మెరిట్‌లో వీరి తర్వాత వారిని సర్టిఫికెట్ల పరిశీలనకు పిలవాల్సి ఉంది. దీంతో అభ్యర్థుల తుది ఎంపికకు మరికొంత సమయం పట్టనుంది.

657 పోస్టులకు 652 మంది అర్హత

జిల్లాలో ప్రభుత్వ, జిల్లా పరిషత్ యాజమాన్యాల్లోని పాఠశాలల్లో 599, మునిసిపల్ పాఠశాలల్లో 30 కలిపి 629 పోస్టులు డీఎస్సీలో ప్రకటించారు. గిరిజన సంక్షేమ, చెంచు పాఠశాలల్లో మరికొన్ని పోస్టులు ప్రకటనలో ఉన్నాయి. మొత్తం 657 పోస్టులకు అంతే మంది అభ్యర్థులను సర్టిఫికెట్ల పరిశీలనకు పిలిచారు.



వీరిలో 652 మందికి అన్నీ సక్రమంగా ఉన్నట్లు ధ్రువీకరించారు. మిగిలిన ఐదుగురులో ఇద్దరు ఇతర ఉద్యోగాల్లో స్థిరపడగా, మరొకరు తెలంగాణ వాసి. ఈ ముగ్గురూ ఇక్కడ టీచర్ పోస్టులకు తమ అయిష్టత (అన్‌విల్లింగ్) తెలియజేస్తూ డీఈవోకు లెటర్లు రాశారు. మరో ఇద్దరికి సంబంధించిన బీఈడీ సర్టిఫికెట్లు నిర్ధిష్ట సమయంలో రాకపోవంతో వారిని అనర్హులుగా ప్రకటించారు.

రాష్ట్రంలో గతంలో ఉపాధ్యాయుల నియామకాలకు నిర్వహించిన డీఎస్సీలకు భిన్నంగా ఈ మెగా డీఎస్సీని నిర్వహించారు. మొదటిసారి డీఎస్సీలో మూడు రకాల కొత్త రిజర్వేషన్లను ప్రభుత్వం అమలులోకి తెచ్చింది.

జిల్లా ఉత్తమ టీచర్ అవార్డులకు 56 దరఖాస్తులు

ఒంగోలు విద్య, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : గురుపూజోత్సవం సందర్భంగా జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ఎంపికకు మొత్తం 56 మంది దరఖాస్తు చేశారు. వీరిలో ఒంగోలు, మార్కాపురం విద్యా డివిజన్‌ల నుంచి సెకండరీ గ్రేడ్ టీచర్‌లు 19 మంది, స్కూల్ అసిస్టెంట్‌లు 33 మంది, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు నలుగురు ఉన్నారు.


సంతనూతలపాడులో ఊరేగింపు నిర్వహిస్తున్న యువకులు


ఒంగోలు నగరం డ్రీమ్స్‌కాలనీలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న భక్తులు


ఒంగోలులో సందడి చేస్తున్న యువతులు

ఘనంగా గణేషుడి నిమజ్జనోత్సవాలు

- ఉత్సాహంగా పాల్గొన్న యువత
- కొత్తపట్నం తీరానికి భారీగా తరలిన వినాయక విగ్రహాలు
- ఊరేగింపులు.. మేళతాళాలతో వీడ్కోలు


కొత్తపట్నం తీరంలో నిమజ్జనానికి తరలివచ్చిన మహిళలు, చిన్నారులు


గుండ్లకమ్మ వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్‌ఐ


ఒంగోలులో రంగులు చల్లుకుంటున్న యువకులు, చిన్నారులు

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వేడుకలకు కొలువుదీరిన విఘ్నేశ్వరుడు భక్తులు అందించిన విశేష పూజలు అందుకున్నాడు. కాగా ఐదవ రోజు.. అందులోనూ ఆదివారం కావడంతో భక్తుల కేరింతల నడుమ సముద్రతీరానికి విగ్రహాలను తరలించారు. ఒంగోలుతోపాటు ఇతర ప్రాంతాలలో ఏర్పాటు చేసిన విగ్రహాలను అంగరంగ వైభవంగా ఊరేగింపులు నిర్వహించారు. గులాములు చల్లుకుంటూ.. డీజే సౌండ్‌లతో.. మేళతాళాలతో గణపయ్య నిమజ్జనోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఒంగోలులోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని నిమజ్జనం చేయగా, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, మేయర్ గంగాడ సుజాత పాల్గొన్నారు. అలాగే నగరంలోని పలు ప్రాంతాలలో జరిగిన నిమజ్జన వేడుకల్లో యువత, మహిళలు, చిన్నారులు భారీగా పాల్గొని సందడి చేశారు. నగరంలోనే సుమారు 100కు పైగా విగ్రహాలు కొత్తపట్నం తీరానికి తరలి వెళ్లాయి. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి మరో రెండు, మూడు వందల వరకు విగ్రహాలు నిమజ్జనం జరిగాయి. నిమజ్జనోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఒంగోలు డీఎస్పీ శ్రీనివాసరావు నేతృత్వంలో వన్‌టౌన్, టూ టౌన్, తాలూకా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

ఒంగోలు మండలంలో..


కొత్తపట్నం తీరంలో వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న యువకులు

ఒంగోలు(రూరల్): ఒంగోలు మండలంలోని పలు గ్రామాలలో వినాయక నిమజ్జన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆదివారంతో వినాయచవితి ఐదురోజులు పూర్తి కావటంతో ప్రజలు గణేషుడి విగ్రహాలను భారీగా ఊరేగింపుల మధ్య నిమజ్జన కార్యక్రమాలకు కొత్తపట్నం, ఒంగోలు మండలంలోని గుండాయపాలెం సముద్రం తీరాలను తరలించారు. ఈ సందర్భంగా యువతీ యువకులు రంగులు చల్లుకుంటూ డప్పు వాయిద్యాల మధ్య ఊరేగింపుగా తరలివెళ్లారు. కొప్పోలులోని బృందావన్ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని నిజమజ్జనానికి తరలించారు. మహిళలు కోలాట ప్రదర్శన నిర్వహించారు. భక్తి గీతాలను ఆలపించారు. అనంతరం కొత్తపట్నం బయలుదేరి వెళ్లారు.

సంతనూతలపాడు మండలంలో..

సంతనూతలపాడు: మండలంలో పలుగ్రామాల్లో ఆదివారం వినాయకుని విగ్రహాలకు ఘనంగా నిమజ్జనోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పందిళ్ల వద్ద అన్నదానాలు చేవారు. సంతనూతలపాడులో పోలీస్‌స్టేషన్ వద్ద, బాపట్లబజారు, వడ్డెరపాలెం, గానుగపాలెం ఏరియాల్లో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాలకు ఊరేగింపు నిర్వహించి నిమజ్జనానికి తరలించారు. కొందరు కొత్తపట్నం సముద్రానికి తీసుకెళ్లగా, మరికొంతమంది చంద్రపాలెం సమీపంలోని ఎన్ఎస్‌పీ కాలువలో పోలీసుల సమక్షంలో నిమజ్జనం చేశారు.

గుండ్లకమ్మ రిజర్వాయర్ వద్ద..

మద్దిపాడు: గుండ్లకమ్మరిజర్వాయర్ వద్ద వినాయక నిమజ్జన కార్యక్రమాలు ఆదివారం వైభవంగా జరిగాయి. మండలంలోని నేలటూరివారిపాలెం, మద్దిపాడు గ్రామంలోని విగ్రహాలను భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. ఎస్ఐ సైదులు బందోబస్తు నిర్వహించారు. నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన చర్యలు చేపట్టినట్లు ఆయన చెప్పారు.

నాగులుప్పలపాడు మండలంలో..

నాగులుప్పలపాడు: వినాయక నిమజ్జన వేడుకలు మండల పరిధిలోని గ్రామాలలో ఆదివారం అత్యంత కోలాహలంగా నిర్వహించారు. నాగులుప్పలపాడు, ఉప్పుగుండూరు, చదలవాడ, ముప్పాళ్ల, ఈదుమూడి, కండ్లగుంట, బి.నిడమానూరు, అమ్మనబ్రోలు, కనపర్తి తదితర గ్రామాల్లోని బొజ్జ గణపయ్యలను పాటలు, డీజే సందడితో యువకులు, మహిళలు, చిన్నారులు కేరింతలతో ఊరేగింపుగా తరలివెళ్లి కనపర్తి, పెదగంజాం తీర ప్రాంతంలో నిమజ్జనం చేశారు. ఎస్ఐ రజియాసుల్తానా ఆధ్వర్యంలో తీర ప్రాంతంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. 13 వినాయక విగ్రహాలు కనపర్తి తీరంలో నిమజ్జనం జరిగినట్లు ఎస్ఐ తెలిపారు.


బృందావన్ గార్డెన్స్‌లో కోలాటం నిర్వహిస్తున్న మహిళలు


కొత్తపట్నం తీరంలో నిమజ్జనానికి తరలివచ్చిన గణపయ్యలు

మంత్రికి పలు వినతులు


విజ్ఞప్తులు పరిశీలిస్తున్న మంత్రి స్వామి

టంగుటూరు (కొండపి), ఆగస్టు31 (ఆంధ్రజ్యోతి): తమ వ్యక్తిగత, గ్రామాల్లోని సమస్యలు పరిష్కరించాలని నియోజవకర్గంలోని, వెలుపల గ్రామాలకు చెందిన పలువురు ఆదివారం రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖా మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామిని తూర్పు నాయుడుపాలెంలోని క్యాంపు కార్యాలయంలో కలిసి ఆదివారం వినతిపత్రాలు అందజేశారు. పలువురు అనారోగ్య బాధితులు సీఎంఆర్‌ఎఫ్ సాయం చేయాలని కోరుతూ వినతిపత్రాలు అందించారు.

ఒంగోలు సబ్‌డివిజన్‌లో 30 పోలీసు చట్టం

ఒంగోలుక్రైం, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఈనెల 1 నుంచి 30వ తేదీ వరకు ఒంగోలు సబ్ డివిజన్ పరిధిలో 30 పోలీసు చట్టం అమలులో ఉంటుందని డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పోలీసు ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించకూడదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

ప్రయోగ కేంద్రాలుగా పాఠశాలలు

- పిల్లలకు విద్యను దూరం చేస్తున్న ప్రభుత్వం
- యూటీఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు ధ్వజం



సభలో ప్రసంగిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

ఒంగోలు విద్య, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు షరతులకు తలొగ్గి పాఠశాలలను ప్రయోగశాలలుగా మార్చి పేద పిల్లలకు నాణ్యమైన విద్యను దూరం చేస్తోందని యూటీఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు విమర్శించారు. ఒంగోలులోని టీటీడీ కళ్యాణ మండపంలో ఆదివారం యూటీఎఫ్ జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశం జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ హై ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పాఠశాల వ్యవస్థలో సమూల మార్పుల పేరుతో ప్రభుత్వం తెస్తున్న సంస్కరణలతో ఉపాధ్యాయులకు బోధనేతర పనుల భారం పెరుగుతోందన్నారు. దీంతో పిల్లలకు చదువు చెప్పేందుకు సమయం లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల స్థాయిలో నిర్వహించే పరీక్షలకు అసెస్మెంట్ బుక్‌లెట్లు ఇచ్చి, మూల్యాంకన విధానంలో టీచర్లపై పనిభారం పెంచారని ఆరోపించారు. ఉపాధ్యాయులు బోధనేతర పనులతో సతమతమవుతుండటంతో ఏకాగ్రతతో పాఠశలల్లో చదువు చెప్పలేక పోతున్నారని పేర్కొన్నారు. టీచర్లపై బోధనేతర పనుల భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల ఆర్థికపరమైన సమస్యల పరిష్కారానికి రూట్‌మ్యాప్ ప్రకటించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, జిల్లా ప్రధానకార్యదర్శి డి.వీరాంజనేయులు, ఎస్.రవి, ఐవీ.రామిరెడ్డి, జి.ఉమామహేశ్వరి, చిన్నస్వామి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

150 మందికి గుండె పరీక్షలు


శిబిరంలో పాల్గొన్న నిర్వాహకులు, వైద్య సిబ్బంది

కొండపి, ఆగస్టు31 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ హెల్ప్ హాస్పిటల్, ఇలవర (నేతివారిపాలెం) టీడీపీ నాయకుడు గోనుగుంట పున్నయ్య ఆధ్వర్యంలో ఆదివారం ఇలవరలో 150 మందికి ఉచిత గుండె పరీక్షల శిబిరం నిర్వహించారు. ఉచిత శిబిరాన్ని టీడీపీ సీనియర్ నాయకుడు బత్తుల నారాయణస్వామి, గ్రామ సర్పంచ్ దేపూరి ప్రసన్న ప్రారంభించారు. కార్యక్రమంలో హెల్ప్ హాస్పిటల్ వైద్యుడు నాగకిరణ్, వైద్య సిబ్బంది ఈసీజీ, టుడీ ఎకో పరీక్షలు నిర్వహించారు. అదనపు వైద్య పరీక్షలు అవసరమైన 25 మందిని డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవలో ఉచితంగా పరీక్షలు నిర్వహించేందుకు విజయవాడ హెల్ప్ వైద్యశాలకు సిఫారసు చేశారు. వీరికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తామని డాక్టర్ నాగకిరణ్ తెలిపారు. రోగులకు భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో కొండపి ఏఎంసీ మాజీ చైర్మన్ గొర్రెపాటి రామయ్య చౌదరి, టీడీపీ మండల అధ్యక్షుడు కొర్రపాటి వసంతరాయుడు, చినవెంకన్నపాలెం మాజీ సర్పంచ్ పోటు శ్రీనివాసరావు, పెరిదేపి మాజీ సర్పంచ్ చెన్నారెడ్డి వెంకటేశ్వర్లు, ఇలవర గ్రామ టీడీపీ నాయకులు గోనుగుంట పున్నయ్య, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

'మన పాఠశాల-మన ఆత్మగౌరవం' పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఒంగోలు(రూరల్), ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ఏకేవీకే కళాశాలలో ఆదివారం మన పాఠశాల మన ఆత్మగౌరవం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్ నాయకుడు ఎ.వేణుగోపాల్‌నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివించేలా విద్యార్థులు, తల్లితండ్రులను ప్రోత్సహించాలన్నారు. విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందేలా బోధించాలని కోరారు. మాతృభాషలో విద్యాబోధన జరిగేలా ఆపస్ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ రాష్ట్ర సంఘటనా కార్యదర్శి సీహెచ్.శ్రావణకుమార్, జిల్లా కార్యదర్శి కె.మల్లికార్జునరావు, ఆంధ్రకేసరి విద్యాకేంద్రం అధ్యక్షుడు మండవ నాగేశ్వరరావు, జిల్లా బాధ్యులు కె.శంకరరావు, బీవీఎస్.గుణప్రసాద్, వె.కోటేశ్వరరావు, కె.విశ్వేశ్వరరావు, మధుసూదనరావు, ప్రసాద్, రాము, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

పల్లామల్లిలో లడ్డూ రూ.60,116


లడ్డూతో టీడీపీ నాయకుడు రాఘవయ్య, యువకులు

చీమకుర్తి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): చీమకుర్తి మండలం పల్లామల్లి గ్రామంలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాల నిమజ్జన వేడుకలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద పూజలో ఉంచిన లడ్డూకి వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు అన్నమనేని రాఘవయ్య లడ్డూని రూ.60,116, ఆపిల్ పండును రావులపల్లి శ్రీను రూ.9,116కి వేలంలో దక్కించుకొని ఊరేగింపుగా తీసుకెళ్లారు. అదేవిదంగా చీమకుర్తి పట్టణంలో రెడ్డిబజార్‌లో విగ్రహం వద్ద ఉంచిన లడ్డూని సునీల్‌కుమార్‌రెడ్డి రూ.31.500కు దక్కించుకున్నారు. పట్టణంలో వినాయకస్వామి నగరోత్సవాన్ని ఘనంగా జరిపారు. 150 కలశాలతో మహిళలు ఊరేగింపులో పాల్గొన్నారు.

కొప్పోలు రోడ్డులో గుంతలు

- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు


రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా ఉన్న గుంత

ఒంగోలు నుంచి కొప్పోలు వెళ్లే రోడ్డులో ఇటీవల కురిసన వర్షాలతో గుంతలు పడ్డాయి. ఈ రోడ్డులోని బృందావన్‌కాలనీ, ఎన్‌టీఆర్ కాలనీల వద్ద గల తారురోడ్డులో పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే ద్విచక్రవాహనదారులు గుంతలలో పడి గాయాలపాలవుతున్నారు. ఒంగోలు మండలం, కొత్తపట్నం మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డులో గుంతలు పూడ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

- ఒంగోలు రూరల్, (ఆంధ్రజ్యోతి)

జాతీయ ప్రతిభా అవార్డు ప్రదానం


లాబానుకు అవార్డును అందజేస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

మద్దిపాడు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ ప్రతిభా అవార్డును మద్దిపాడుకు చెందిన అధ్యాపకుడు, హెచ్‌జేఎల్‌ఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాటిబండ్ల లాబాను అందుకొన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా గుంటూరులోని సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ అండ్ టీచర్స్ ఆర్గనైజేషన్, కేవీఆర్ అండ్ జయలక్ష్మి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించిన ప్రతిభా అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో గిద్దలూరులోని ఓ ప్రైవేటు కళాశాలలో చరిత్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్న మద్దిపాడుకు చెందిన పాటిబండ్ల లాబానుకు ఎమ్మెల్సీ కేఎస్.లక్ష్మణరావు చేతుల మీదుగా అవార్డు అందజేసి సన్మానించారు.

నిమజ్జనం చేసిన విగ్రహమే అది..!



చినగంజాం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మోటుపల్లి సముద్రతీరం వద్ద వేణుగోపాలుడి విగ్రహం ఇటీవలే చినమల్లవరం గ్రామస్థులు నిమజ్జనం చేసినట్లు తెలిసింది. శనివారం ఆ విగ్రహం మోటుపల్లి తీరం వద్దకు రాగా, ఆ వార్త 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైంది. ఆ విగ్రహం చూసిన చినమల్లవరం గ్రామస్థులు తామే ఆ విగ్రహాన్ని నిమజ్జనం చేశామన్నారు. గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయం జీర్ణోద్ధరణ అనంతరం నూతన విగ్రహాలను ప్రతిష్ఠించామని, పూర్వవిగ్రహాన్ని పూజారుల సలహాతో గత నెల 29న (శుక్రవారం)సాయంత్రం ఐదు గంటల సమయంలో గ్రామంలోని గణేషుడి విగ్రహంతో పాటు వేణుగోపాలస్వామి విగ్రహాన్ని కూడా సముద్రంలో నిమజ్జనం చేసినట్లు నాగరాజు తెలిపారు. ప్రస్తుతం ఆ విగ్రహం నాగులుప్పలపాడు మండలం కనపర్తి మ్యూజియానికి చేరింది.

భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలు

ఒంగోలులో పూజలు నిర్వహించిన ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే దామచర్ల ● వినాయక మండపాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు


గాంధీరోడ్‌లో గణేషుడి విగ్రహం వద్ద ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే దామచర్ల


నాగులుప్పలపాడులో ఎమ్మెల్యే బీఎన్‌ను సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలో ని గణేషుడి నవరాత్రులు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. స్థానిక ద్వా రకానగర్‌లో, స్థానిక గాంధీరోడ్‌లో ది గోల్డ్ సిల్వర్ మర్చంట్స్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గాంధీరోడ్ స్వర్ణకారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద, తిరుమల గోల్డ్‌షాప్ వద్ద వినాయక మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాలలో నిర్వహణ కమిటీ ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. దీంతో ఐదవ రోజు కూడా కొనసాగిన వినాయక చవితి ఉత్సవాలలో భక్తులు పూజలు చేశారు.

ఎమ్మెల్యే బీఎన్ పూజలు

నాగులుప్పలపాడు: నాగులుప్పలపాడు గ్రామంలోని శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి వారి దేవస్థానం వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఎమ్మెల్యేకు శాలువా కప్పి సన్మానించారు. అనంతరం నిర్వహించిన వినాయకుని లడ్డూ వేలంలో గ్రామానికి చెందిన షేక్ మీరావలి, లాలమ్మ, నాగరాజు, రంజాన్‌బిలు రూ.63వేలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ కొంజేటి ధనుష్, పల్లపోతు సాయిచరణ్, నందిగం కోటయ్య, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా రాధాష్టమి



ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలో రాధాష్టమి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మంగమూరురోడ్‌లోని వేద పాఠశాల వద్ద రాధా గోవింద ఆశ్రమంలో రాధాకృష్ణుల మందిరాన్ని పుష్పతోరణాలతో నేత్ర పర్వంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా 108 రకాల ప్రసాదాలను రాధాదేవి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. సామూహిక భగవద్గీత పారాయణంతోపాటు భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అశఘరి కృష్ణమోహనాచార్యులు, శ్రీనివాసాచార్యులు, భక్తులు పాల్గొన్నారు. అలాగే గోపాలనగరంలోని కృష్ణుడి గుడి వద్ద రాధాదేవి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద మహిళలు కోలాట ప్రదర్శన నిర్వహించారు.

మంగమూరురోడ్‌లోని రాధా గోవింద ఆశ్రమంలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు


గోపాలపురంలో కృష్ణుడి ఆలయం వద్ద కోలాట ప్రదర్శన ఇస్తున్న మహిళలు

వినాయకా.. సెలవిక...!


కొత్తపట్నం తీరంలో నిమజ్జనానికి తరలివచ్చిన గణనాథులు

- కొత్తపట్నం తీరానికి భారీగా తరలివచ్చిన గణనాథులు
- వందల సంఖ్యలో బారులుదీరిన వాహనాలు
- ఒంగోలు-కొత్తపట్నం రహదారిలో రద్దీ
- భక్తులతో కిటకిటలాడిన తీర ప్రాంతం


తీరంలో వినాయక విగ్రహాలతో బాలలు

కొత్తపట్నం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి) : కొత్తపట్నం సముద్రతీర ప్రాంతం ఆదివారం గణనాథుల నిమజ్జనాలతో కోలాహలంగా మారింది. వందల సంఖ్యలో స్వామి విగ్రహాలను భక్తులు నిమజ్జనం కోసం తీరానికి తరలించారు. ఒంగోలు, చీమకుర్తి, సంతనూతలపాడుతోపాటు కొత్తపట్నం మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలు తరలివచ్చాయి. మొత్తం 500లకు పైగా విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఒక్క కొత్తపట్నం తీరంలోనే 320 దాకా విగ్రహాలను నిమజ్జనం చేసినట్లు అంచనా. ఈతముక్కల, మడనూరు, పిన్నివారిపాలేల్లో తీరాల్లో కూడా నిమజ్జన కార్యక్రమం ఘనంగా జరిగింది. విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు లారీలు, బస్సులు, ట్రాక్టర్లు, మినీ లారీలు, కార్లు, ద్విచక్ర వాహనాలతో వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఊరేగింపులు, డీజే సౌండ్స్, డప్పులు మోతలతో హోరెత్తించారు. మహిళలు కూడా విగ్రహాల వెంట వేల సంఖ్యలో వచ్చి పూజలు చేశారు. పోలీసులు పటిష్ఠమైన ఏర్పాట్లు చేశారు. తీరంలోకి విగ్రహాలు ఉన్న వాహనాలనే అనుమతించి ఇతర వాహనాలను పక్కకు మళ్లించారు. రద్దీ ఎక్కువగా ఉండడంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి విగ్రహాలను వాహనం నుంచి దింపి సముద్రంలో నిమజ్జనం చేయించారు. ఒంగోలు టూటౌన్ సీఐ శ్రీనివాసరావు, కొత్తపట్నం ఎస్ఐ సుధాకర్ తమ సిబ్బందితో ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు గణేషుని విగ్రహాలు తీరానికి తరలివస్తూనే ఉన్నాయి. పోలీసులు తీరంలో ఫ్లడ్ లైట్లను ఏర్పాటు చేశారు. డ్రోన్ కెమెరాలతో పరిస్థితిని సమీక్షించారు. కొత్తపట్నం-ఒంగోలు రహదారిలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులు సముద్రం లోనికి ప్రవేశించకుండా ఎప్పటికప్పుడు మైకుల ద్వారా ప్రచారం చేశారు. గత ఈతగాళ్లను, నాటు పడవలను తీరంలో సిద్ధంగా ఉంచారు. గణేషును నిమజ్జనం చేసిన అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కొత్తపట్నం, కె పల్లెపాలెం గ్రామాల్లోని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.


ఒంగోలులోని టీడీపీ ఆఫీస్‌లో ఎమ్మెల్యే దామచర్ల దంపతులు, శ్రేణులు


ఒంగోలులో సందడి చేస్తున్న యువకులు

వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎస్పీ

ఒంగోలు క్రైం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గణేష్ నిమజ్జనాలు శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్పీ దామోదర్ చెప్పారు. స్థానిక పోలీసు క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహం వద్ద ఆదివారం ఎస్పీ పూజలు చేశారు. అనంతరం విగ్రహాన్ని ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ కే శ్రీనివాసరావు, ఏఆర్ ఆర్ఐలు రమణారెడ్డి, సీతారామిరెడ్డి, ఆర్ఎస్సైలు ప్రసాద్, మాల్యాద్రి, తిరుపతిస్వామి పాల్గొన్నారు.


ఒంగోలులోని పోలీస్ కార్యాలయంలో ఎస్పీ దామోదర్, పోలీస్ అధికారులు


విజేతలకు బహుమతులను అందజేస్తున్న కేఐవో అధ్యక్షుడు మిల్టన్ శాస్త్రి

కరాటేలో మార్కాపురం విద్యార్థుల ప్రతిభ

బంగారు, వెండి పతకాల సాధన

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : బెంగళూరులోని కోరమంగళ ఇండోర్ స్టేడియంలో జరిగిన 4వ సౌత్ జోన్ కరాటే టోర్నమెంట్‌లో మార్కాపురం ఎంఎస్ స్పోర్ట్స్ కరాటే పాఠశాల విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబరిచారు. ఈనెల 30, 31న జరిగిన పోటీలలో 3 బంగారు, 2 వెండి పతకాలను సాధించారు. కరాటే పాఠశాలకు చెందిన ఎస్‌కే షాకీర్ బాషా 75 కేజీల కుమితే విభాగంలో బంగారు పతకం, ఎస్‌కే ఆసిఫ్ 9 సంవత్సరాల బాలుర కటా విభాగంలో బంగారు పతకం, కుమితేలో వెండి పతకం, ఎస్‌కే యాసిన్ 12వ సంవత్సరాల బాలుర కటా విభాగంలో బంగారు పతకం, జేకేఎస్‌సీ భార్గవ్ 15వ సంవత్సరాల 50 కేజీల కుమితే విభాగంలో వెండి పతకాలు సాధించారు. ఈ సందర్భంగా ఏపీ కరాటే అసోసియేషన్(కేఐవో) అధ్యక్షుడు కె.మిల్టన్ శాస్త్రి విజేతలకు బహుమతులను అందజేసి ప్రశంసించారు. పతకాలను సాధించిన విద్యార్థులను పాఠశాల చీఫ్ ఎగ్జామినర్ మారంరెడ్డి శ్రీనివాస్ రెడ్డి(బ్లాక్ బెల్ట్ 7వ డాన్), సీనియర్ ఇన్‌స్పెక్టర్ తోట ప్రసాద్(బ్లాక్ బెల్ట్ 6వ డాన్) అభినందించారు.

బైకును ఢీకొట్టిన కారు.. వ్యక్తి మృతి

ఇద్దరికి తీవ్రగాయాలు


కొండారెడ్డి(ఫైల్)

మార్కాపురం రూరల్, ఆగస్టు31 (ఆంధ్రజ్యోతి) : కారు బైకును ఢీకొట్టిన ఘటనలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి చెందాడు. మార్కాపురం మండలంలోని కోమటికుంట వద్ద జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన ఈ ప్రమాదంలో బైకుపై వెనుక కూర్చున్న వేల్పుల కొండారెడ్డి (40) తీవ్రంగా గాయపడి ఆసుపత్రికి తరలించగా మృతి చెందాడు. ఆయన హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్‌గా పనిచేస్తున్నాడు. బైకుపై ఉన్న మరో ఇద్దరు వేల్పుల వెంకటరెడ్డి, రొక్కం శివారెడ్డికి తీవ్ర గాయాలు కాగా వారిని ఒంగోలు తరలించారు. వినాయక చవితి పండుగ కోసం స్వగ్రామమైన గొట్టిపడియ వచ్చిన కొండారెడ్డి ఇద్దరు మిత్రులతో కలిసి మార్కాపురం వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నారు. అదే సమయంలో గుంటూరు నుంచి కంభం వైపు వస్తున్న కారు కోమటికుంట బైకును ఢీకొట్టింది. మృతుడు కొండారెడ్డికి భార్య ఇద్దరు పిల్లలున్నారు. బైకును ఢీకొట్టి వెళ్లిన కారుకు సీఎంవో స్టిక్కర్ ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు ప్రమాదం జరిగిన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.


ప్రమాదంలో ధ్వంసమైన బైక్

నైతిక విలువలతో కూడిన జర్నలిజంతోనే గుర్తింపు

ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ముగిసిన విలేకరుల శిక్షణ శిబిరం


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందుల

మార్కాపురం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : విలేకరులు నైతిక విలువలతో పని చేస్తేనే జర్నలిజానికి గుర్తింపు వస్తుందని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సీఆర్ మీడియా అకాడమీ, ఏపీయూడబ్ల్యూజే సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాలోని విలేకరులకు జరుగుతున్న పునశ్చరణ తరగతులు ముగిశాయి. ఈ సందర్భంగా ఆదివారం సాయంత్రం జరిగిన ముగింపు సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కందుల మాట్లాడుతూ సమాజంలోని సమస్యల పరిష్కారానికి మీడియా చొరవ ఎంతో అవసరం అన్నారు. కచ్చితత్వంతో కూడిన కథనాలను ప్రచురించడం ద్వారా మీడియా సంస్థలకు విశ్వసనీయత పెరుగుతుందన్నారు. నేటి ఆధునిక సమాజం సోషల్, వెబ్ మీడియాల ప్రభావానికి లోనవుతోందన్నారు. కొన్ని మీడియాలు సంచలనాల కోసం అత్యుత్సాహంతో కట్టు తప్పుతున్నాయన్నారు. ఆయా సంస్థల వలన వ్యక్తులకు, సమూహాలకు నష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు. గ్రామీణ ప్రాంత విలేకరుల సమస్యల పరిష్కారానికి ముందుంటానని అన్నారు. డీఎస్పీ డాక్టర్ యు.నాగరాజు మాట్లాడుతూ ఒకనాటి జర్నలిజానికి, నేటి జర్నలిజానికి చాలా వ్యత్యాసం ఉందన్నారు. ఒకప్పుడు ఎలాంటి సదుపాయాలు, సాంకేతికత అందుబాటులో లేకపోయినా విలేకరులు ఎంతో కష్టపడి కచ్చితమైన సమాచారంతో కథనాలు రాసేవారన్నారు. నేడు నాణ్యతగల కథనాలు తగ్గిపోయాయన్నారు. సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్‌కుమార్ మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను విధి నిర్వహణలో అమలు జరిగేలా చూడాలన్నారు. విలువలతో కూడిన జర్నలిజానికే ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐవీ సుబ్బారావు మాట్లాడుతూ కష్టపడే తత్వం ఉంటే ఎవరైనా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. జర్నలిస్టులు నిత్య విద్యార్థులన్నారు. నిరంతరం సమాచార సముపార్జనకు కృషి చేస్తేనే మంచి కథనాలు వెలువడుతాయన్నారు. ప్రభుత్వాలు, ప్రజలకు వారధిగా బాధ్యతాయుతంగా పనిచేసి గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. ఆదివారం ఉదయం 10.00 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు నాలుగు అంశాలపై విలేకరులకు శిక్షణ ఇచ్చారు. కృత్రిమ మేధపై సీనియర్ జర్నలిస్టు విజయ్‌కుమార్, విలేకరుల నుంచి డెస్క్ ఏం కోరుకుంటోంది అనే అంశంపై నెల్లూరు ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్‌చార్జి రామకృష్ణ, పత్రికా బాషా మెళకువలపై ఆంధ్రజ్యోతి సెంట్రల్ డెస్క్ విభాగం సీనియర్ జర్నలిస్టు సతీష్, ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టింగ్‌పై మెళకువలు అంశంపై టెన్ టీవీ బ్యూరో చీఫ్ కె.జయరాజ్ శిక్షణ ఇచ్చారు. అనంతరం ముగింపు సభలో శిక్షణలో పాల్గొన్న విలేకరులకు సర్టిఫికెట్లు, వివిధ అంశాపై అకాడమీ ప్రచురించిన పుస్తకాలను అందజేశారు.

తిరుపతికి మార్కాపురం, గిద్దలూరు మీదుగా రైలు

గిద్దలూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన తిరుపతికి చర్లపల్లి నుంచి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలును నడపనున్నారు. ఈనెల 9 నుంచి ఈ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభం కానున్నట్లు స్థానిక రైల్వే అధికారులు తెలిపారు. సెప్టెంబరు, అక్టోబరు, నవంబరులో ప్రతి మంగళవారం చర్లపల్లిలో, ప్రతి బుధవారం తిరుపతి నుంచి ఈ రైలు బయలుదేరుతుందని పేర్కొన్నారు. సెప్టెంబరు 9వ తేదీ చర్లపల్లిలో (07013) నెంబరుతో 9.10 గంటలకు బయలుదేరే ఈ రైలు నల్లగొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, వినుకొండ, దొనకొండ, మార్కాపురం, కంభం మీదుగా మరుసటి రోజు తెల్లవారుజామున 4గంటలకు గిద్దలూరు చేరుకుంటుందని, నంద్యాల, కోవెలకుంట్ల, జమ్మలమడుగు, పొద్దుటూరు, యర్రగుంట్ల, కడప, ఒంటిమిట్ట, రాజంపేట, కోడూరు, రేణుగుంట్ల మీదుగా మధ్యాహ్నం 12.30 గంటలకు తిరుపతి చేరుతుందని పేర్కొన్నారు. ఇదే రైలు(07014) నెంబరుతో సాయంత్రం 4.40 గంటలకు తిరుపతిలో బయలుదేరి ఇదే రూటులో అర్ధరాత్రి 11.30 గంటలకు గిద్దలూరు చేరి మరుసటి రోజు ఉదయం 8గంటలకు చర్లపల్లి చేరుతుందని రైల్వే అధికారులు తెలిపారు.

ఏపీ హెచ్‌ఎంల అసోసియేట్ అధ్యక్షుడిగా శ్రీనివాసరావు


శ్రీనివాసరావు

ఒంగోలు విద్య, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర నూతన కార్యవర్గంలో జిల్లాకు స్థానం లభించింది. అసోసియేట్ రాష్ట్ర నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం విజయవాడలో జరిగాయి. జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు(డీసీఈబీ) కార్యదర్శిగా పనిచేస్తున్న కె.బిట్రగుంట జడ్పీ హైస్కూలు హెచ్‌ఎం ఎం. శ్రీనివాసరావును అసోసియేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈసందర్భంగా పలువురు హెచ్‌ఎంలు శ్రీనివాసరావుకు అభినందనలు తెలిపారు.

తపాలా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా రవీంద్ర


నూతనంగా ఎన్నికైన భారతీయ తపాలా సంఘం కమిటీ సభ్యులు

పొదిలి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : భారతీయ తపాలా సంఘం ప్రకాశం డివిజన్ కార్యవర్గం ఎన్నికలు ఆదివారం స్థానిక ప్రధాన తపాలా కార్యాలయంలో జరిగాయి. అధ్యక్షుడిగా ఎం.రవీంద్ర, ఉపాధ్యక్షుడిగా ఎస్.స్వరూపారాణి, ఎం.రాజశేఖర్, కార్యదర్శిగా సయ్యద్, ఉపకార్యదర్శిగా ఏ శివశేఖర్‌రెడ్డి, సహాయ కార్యదర్శులుగా కె సాయిరాం, డీ జయపాల్, ఎస్‌కే రసూల్, ఆర్ గణేష్, కె ప్రమోద్, ఎల్ వెంకట్రావ్, కోశాధికారిగా ఎస్.శేఖర్, కార్యనిర్వాక కార్యదర్శులుగా ఎస్‌కె బాజీబీ, ఆర్.సునీత, ఎస్.రాజశేఖర్ ఎన్నికయ్యారు. ఎన్నికల ప్రక్రియను రాష్ట్ర కార్యదర్శి సీహెచ్.వెంకయ్య పర్యవేక్షించారు. నూతనంగా ఎన్నికైన నాయకులను మార్కాపురం డివిజనల్ సూపరింటెండెంట్ జీవీ శ్రీనివాసులు అభినందించారు.

డీసీఏవో రాజశేఖర్ ఉద్యోగ విరమణ

ఒంగోలు విద్య, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి) : జిల్లా సహకార ఆడిట్ అధికారిగా పనిచేస్తున్న జి.రవిరాజశేఖర్ ఆదివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయ అధికారులు, సిబ్బంది ఆయనకు ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలిపి ఘనంగా వీడ్కోలు పలికారు. జిల్లా సహకార ఆడిట్ అధికారిగా ఒంగోలు డివిజనల్ సహకారాధికారి డి.శ్రీనివాసరావుకు పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టారు.

ఒంగోలులో 'సుందరకాండ' సందడి..!

కేక్ కట్ చేసి సంతోషాలు పంచుకున్న చిత్ర యూనిట్

అభినందనలు తెలియజేసిన ఎమ్మెల్యే దామచర్ల

వెంకటేష్ నిమ్మలపూడి దర్శకత్వంలో తెరకెక్కిన 'సుందర కాండ' చిత్రం యూనిట్ ఆదివారం ఒంగోలులో సందడి చేసింది. స్థానిక గోరంట్ల మల్టీప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. హీరో నారా రోహిత్, హీరోయిన్ వీర్తి, దర్శకుడు వెంకటేష్, నిర్మాత శ్యామ్‌తోపాటు పలువురు చిత్ర యూనిట్లు కేక్ కట్‌చేసి సంతోషాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా హీరో రోహిత్ మీడియాతో మాట్లాడుతూ మంచి కథతో వచ్చిన చిత్రాలను ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారన్నారు. అందుకు నిదర్శనమే సుందరకాండ చిత్రం అని చెప్పారు. సుందరకాండ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరిస్తున్నారని, ఈ చిత్రం విజయం ప్రేక్షకులదే అని పేర్కొన్నారు. మంచి కథలు వస్తే ఎవరితోనైనా నటించడానికి సిద్ధమేనన్నారు. ఇప్పటికే అయిదారు కథలు సిద్ధంగా ఉన్నాయని, త్వరలోనే వివరాలు ప్రేక్షకులకు తెలియజేస్తానని చెప్పారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ రోహిత్ ఎప్పుడూ మంచి చిత్రాలు తీస్తారన్నారు. సుందర కాండ కుటుంబ సమేతంగా వీక్షించామని చెప్పారు. కార్యక్రమంలో గోరంట్ల యజమానులు గోరంట్ల వీరనారాయణ బాబు, ఓంకార్,టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పఠాన్ హనీఫ్‌ఖాన్‌తోపాటు రోహిత్ అభిమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అభిమానుల మధ్య చిత్రం యూనిట్, ఎమ్మెల్యే దామచర్ల కేక్ కట్ చేశారు.

- ఒంగోలు కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి)


మాట్లాడుతున్న సినీహీరో రోహిత్, పక్కన ఎమ్మెల్యే జనార్దన్, హీరోయిన్ వీర్తి

తీగ మొక్కను తొలగించారు

- అల్లుకున్న ప్రమాదంపై స్పందించిన అధికారులు
- హర్షం వ్యక్తం చేసిన వసతి గృహం సిబ్బంది, బాలికలు


పోల్‌కు తొలగించిన తీగ మొక్క

ఎర్రగొండపాలెం రూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): అల్లుకున్న ప్రమాదం శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై వచ్చిన విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. మాచర్ల - మార్కాపురం రహదారిలోని బాలికల వసతి గృహాన్ని ఆనుకొని ఉన్న విద్యుత్ స్తంభానికి తీగ మొక్క అల్లుకొంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వసతి గృహం బాలికలు, తల్లిదండ్రులు, అటుగా వెళ్లే వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈసమస్యపై ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై స్పందించిన విద్యుత్ అధికారులు ఆదివారం స్తంభానికి ఉన్న తీగ, పిచ్చి చెట్లను తొలగించారు. దీనిపై బాలికలు, వాహనదారులు హర్షం ప్రకటించారు.

కర్ర అక్రమ రవాణా

- యథేచ్ఛగా ప్రభుత్వ స్థలాల్లో చెట్ల నరికివేత
- ఇటుకలు, బొగ్గుల బట్టీలకు తరలింపు
- వాల్టా నిబంధనలు గాలికి
- పట్టించుకోని అధికారులు

ఎర్రగొండపాలెం రూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఖజానాకు కొందరు గండి కొడుతున్నారు. కర్రను కొందరు అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఎర్రగొండపాలెం మండలంలోని గురిజేపల్లి, బోయలపల్లి, కొలుకుల, అయ్యంబొట్లపల్లి, గొళ్లవిడిపి, మురారిపల్లి తదితర గ్రామాలలో ఉన్న ప్రభుత్వ స్థలాల్లో ఏపుగా పెరిగిన పెద్దపెద్ద చెట్లను నరికివేసి ఇటుక బట్టీలకు, బొగ్గుల బట్టీలకు లారీలు, ట్రాక్టర్‌లు, చివరకు ఆటోల్లో కూడా ఎక్కించి విచ్చలవిడిగా అమ్ముకుంటున్నారు.

అక్రమంగా నరికి ఇటుక, బొగ్గుల బట్టీలకు

మండలంలో అయ్యంబొట్లపల్లి, వైపాలెం, కొత్తపల్లి, పెద్ద చెరువు, త్రిపురాంతకం రహదారి తదితర ప్రాంతాలలో ఉన్న ఇటుకలు, బొగ్గుల బట్టీలకు కర్రను తరలిస్తూ ప్రభుత్వ సొమ్మును వారి జేబుల్లోకి వేసుకుంటున్నారు. చెట్లను నరకడం, ఇతర ప్రాంతాలకు తరలించడం నేరమని అధికారులు చెప్తున్నా ఆ నిబంధనలను లెక్కచేయని అక్రమార్కులు కర్రను అమ్ముతూ లక్షలు సంపాదిస్తున్నారు.

ప్రమాదకరంగా ప్రయాణం

కర్ర అక్రమ వ్యాపారం చేస్తుండగా రవాణా విషయంలో తీవ్ర నిర్లక్ష్యాన్ని చూపుతున్నారు. వాటిని


గురిజేపల్లి నుంచి ప్రమాదకరంగా ఆటోలో తరలిస్తున్న కర్ర

వాహనాల్లో ఇష్టమొచ్చినట్లు లోడ్ చేసి కనీస భద్రత లేకుండా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. రాత్రి వేళల్లో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక పోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు చెప్తున్నారు.


ఇటుకల బట్టీలకు తోలిన కర్ర

అనుమతులు లేవు

వాల్టా చట్టం నిబంధనల మేరకు ఇటుక వ్యాపారులు గానీ, కర్ర రవాణాదారులు గానీ కచ్చితంగా అనుమతులు తీసుకోవాలి. అయితే ఎలాంటి అనుమతులు లేకుండా చెట్లను నరికి కర్రను అక్రమంగా తరలిస్తున్నట్లు పరిసర గ్రామాల ప్రజలు చెప్తున్నారు. సంబంధిత అధికారులు చెట్ల నరికివేత, కర్ర అక్రమ రవాణాపై దృష్టి సారించాలని, ఇటుకలు, బొగ్గుల బట్టీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అనుమతులు తప్పనిసరి

- డీ మంజునాథరెడ్డి, తహసీల్దార్



ఇటుకలు, బొగ్గుల బట్టీలకు నిర్వహణకు తప్పనిసరిగా పంచాయతీ, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల అనుమతులు తప్పనిసరిగా ఉండాలి. ఇటీవల తమ వద్దకు అనుమతుల కోసం ఎవరు రాలేదు. పంచాయతీ అనుమతులు తప్పనిసరిగా ఉండాలి. ఇటీవల ఇటుకల బట్టిలను తనిఖీ చేశాం. అన్ని రకాల అనుమతులు తీసుకోవాలని సూచించాం. ఇదే విషయంపై పంచాయతీ కార్యదర్శి రామసుబ్బయ్యను వివరణ కోరగా.. నేను కొత్తగా బాధ్యతలు తీసుకున్నానని వాటి వివరాలు తెలియాల్సి ఉందని తెలిపారు.


గంటవానిపల్లె వద్ద తీగలేరు కాలువను పరిశీలిస్తున్న గూడూరి

గంటవానిపల్లెలో బ్రిడ్జి నిర్మాణానికి నిధుల మంజూరుకు కృషి

టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

పెద్ద దోర్నాల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంటవానిపల్లె బ్రిడ్జి నిర్మాణానికి నిధుల మంజూరుకు కృషి చేస్తున్నట్లు ఎర్రగొండపాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు తెలిపారు. దోర్నాలకు చెందిన టీడీపీ నాయకులు కటికల దానం భార్య అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న ఎరిక్షన్‌బాబు బాధిత కుటుంబాన్ని పరామర్శించి, సానుభూతిని తెలిపారు. అనంతరం గంటవానిపల్లె వద్ద తీగలేరుపై గ్రామ ప్రజలు ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక దారిని పరిశీలించారు. దశాబ్దాల కిందట నిర్మించిన చప్టా శిథిలావస్థకు చేరి వరద నీరు రోడ్డుపై ప్రవహించడంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడిందని, ఈ నేపథ్యంలో గ్రామ ప్రజలు తన దృష్టికి తెచ్చారని ఎరిక్షన్‌బాబు తెలిపారు. ఈ విషయాన్ని కలెక్టర్‌కు తెలియజేశానన్నారు. తక్షణ మరమ్మతుల కోసం రూ.5లక్షలు మంజూరు చేశారన్నారు. శాశ్వత పరిష్కార మార్గంగా ప్రభుత్వం సంబంధిత అధికారులతో ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించినట్లు తెలిపారు. సుమారు రూ.3కోట్ల నిధులు అవసరంగా భావిస్తున్నట్లు, త్వరలోనే ఆ నిధుల విడుదలకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు షేక్ మాబు, వెచ్చా హరగోపాల్, కే సుబ్బారెడ్డి, షేక్ మంజూర్ బాషా, షేక్ మౌలాలి, పుల్లయ్య నాయక్, దర్శనం పెద్దబాబు సుధీర్ పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం


సైకిళ్లపై తిరుగుతున్న పోలీసులు

మార్కాపురం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసు అధికారులు, సిబ్బంది ఆదివారం సైకిళ్లపై పట్టణంలో తిరిగారు. స్థానిక పోలీసు స్టేషన్ నుంచి ఎస్‌వీకేపీ కాలేజీ వరకు అక్కడ నుంచి పట్టణంలోని పలు వీధుల్లో సైకిళ్లపై పర్యటించారు. ఈ సందర్భంగా సీఐ పి.సుబ్బారావు మాట్లాడుతూ ఫిజికల్ ఫిట్‌నెస్ కోసం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతి ఆదివారం సైకిళ్లపై తిరుగుతున్నట్లు తెలిపారు. ఆరోగ్యంతోపాటు పరిసరాలను సూక్ష్మస్థాయిలో పరిశీలించేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో టౌన్, రూరల్ ఎస్సైలు ఎం.సైదుబాబు, డాక్టర్ రాజమోహన్‌రావు, అంకమ్మరావు, అహరోన్, సిబ్బంది పాల్గొన్నారు.

పోలేరమ్మకు ఆదివారం జాతర



మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : పట్టణ శివారులోని అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి జాతర వైభవంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని నిమ్మకాయ దండలు, వివిధ పుష్పమాలలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించి నాగుల పుట్టలో పాలు పోశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు కుంకుమ బళ్లు కట్టి మొక్కులు తీర్చుకున్నారు.

ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధి పరుగులు

ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అశోక్ రెడ్డి

రాచర్ల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ఏడాది కాలంలోనే ప్రజా ప్రభుత్వం అభివృద్ధిని పరుగులు పెట్టిస్తోందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. రూ.1.22కోట్ల నిధులతో మంజూరైన అభివృద్ధి పనులకు ఆదివారం ఆయన ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రభుత్వం మాట నిలుపుకుందన్నారు. సూపర్ సిక్స్ పథకాలు కొన్ని అమలయ్యాయని మరికొన్ని అమలుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. అభివృద్ధిలో భాగంగా చోళవీడు గ్రామంలో రూ.43.60లక్షలతో సచివాలయ భవన నిర్మాణం రూ.24లక్షతో, రైతు భరోసా కేంద్రం రూ.20.80లక్షలతో, హెల్త్ క్లినిక్ సెంటర్ రూ.34లక్షలతో అంతర్గత సిమెంట్ రోడ్డు నిర్మించినట్లు తెలిపారు. ప్రజల సంక్షేమం గ్రామాల అభివృద్ధిలో భాగంగా ఈ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. రాబోయే రోజుల్లో ప్రజల సహకారంతో మరిన్ని సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులతో ప్రభుత్వం ముందుకు వెళతుందన్నారు. కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే అశోక్ రెడ్డికి స్థానిక నాయకులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కటిక యోగానంద్, సొసైటీ బ్యాంకు చైర్మన్ గోపిరెడ్డి జీవనేశ్వర్ రెడ్డి, ఎంపీడీవో ఎస్ వెంకటరామిరెడ్డి, పంచాయతీ రాజ్ డీఈ ఎన్‌వీ సుబ్బారెడ్డి, ఈవోఆర్డీ ఐ.వెంకటేష్, ఏఈలు సుబ్బారావు, ఈదుల రంగస్వామిరెడ్డి, స్థానిక నాయకులు బత్తిని రామకృష్ణ, బత్తిని రాజశేఖర్, బత్తిని వెంకటేశ్వరరావు, శిరిగిరి శ్రీనివాసులు, కృష్ణయ్య పాల్గొన్నారు.


ముండ్లపాడులో వేలంపాటలో దక్కించుకున్న లడ్డూ

ఘనంగా గణనాథుల నిమజ్జనాలు

రూ.84వేలు పలికిన లడ్డూ ప్రసాదం

కొమరోలు, ఆగస్టు 31 : మండలంలోని బాదినేనిపల్లి, నాగిరెడ్డిపల్లి, గోపానిపల్లి, తాటిచెర్ల మోటు, కొమరోలు గ్రామాల్లో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన గణనాథులకు ఆదివారం ఐదవ రోజు భక్తిశ్రద్ధలతో పూజించి నిమజ్జనాలకు తరలించారు. మండపాల వద్ద ప్రతి రోజూ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వివిధ ఆటల పోటలు నిర్వహించి విజేతలకు బహుమతలను అందజేశారు. మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో వినాయకుడి లడ్డు ప్రసాదాన్ని గ్రామానికి చెందిన మాదాల పెద్ద వెంకటయ్య, గోపిదేసి రఘునాథ్, కొత్తకోట శేఖర్ కలసి రూ.84వేలకు వేలంలో లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్నారు. మండలోని బాదినేనిపల్లిలో రూ.7,500కు లడ్డూ ప్రసాదాన్ని కామూరి రాఘవరెడ్డి, గోపానిపల్లి గ్రామంలో చెదుళ్ల ఉదయ్‌కుమార్‌రెడ్డి రూ.26వేలకు లడ్డూని దక్కించుకున్నారు. యువకులు రంగులు చల్లుకుని జై జై గణేశా, బై బై గణేశా అంటూ గణపతిని సాగనంపారు.

రూ.20,116 పలికిన వినాయక లడ్డూ

గిద్దలూరు : వినాయక చవితి వేడుకలు ఘనంగా సాగుతున్నాయి. మండలంలోని ముండ్లపాడు గ్రామంలోని లక్ష్మీచెన్నకేశవస్వామి దేవస్థానం వద్ద 8వ గణపతి స్వామి వార్షికోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా స్వామి వారి లడ్డూ ప్రసాదానికి వేలంపాట నిర్వహించగా రఘుపతి మోహన్‌బాబు రూ.20,116కు దక్కించుకున్నారు. పట్టణంలోని శర్మవీధిలోని జువ్విళ్లబావి వినాయకస్వామి దేవస్థానంలో లడ్డూ వేలంపాటలో పల్లె శేషమ్మ రూ.90వేలకు స్వామి వారి లడ్డూను దక్కించుకున్నారు. కలిశ బుడమను వేలం వేయగా నాగార్జునరెడ్డి అనే భక్తుడు రూ.13వేలకు దక్కించుకున్నారు. స్వామి వాహనం ఎలుకను రూ.12వేలకు పల్లె పుల్లారెడ్డి దక్కించుకున్నారు.

గిద్దలూరు టౌన్ : పట్టణంలోని 4వ వార్డులోని శ్రీరామ్‌నగర్‌లో వినాయక మండపం వద్ద లడ్డూ వేలంపాట నిర్వహించారు. బ్రహ్మారెడ్డి రూ.25,500 లడ్డూను దక్కించుకున్నారు.

తర్లుపాడు : వినాయక చవితి సందర్భంగా మండలంలో ఏర్పాటు చేసిన పలు వినాయక విగ్రహాలను ఐదో రోజు ఆదివారం నిమజ్జనానికి తరలించారు. ముందుగా స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ట్రాక్టర్‌లపై వినాయక విగ్రహాలను ఉంచి గ్రామ వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. రెడ్డియూత్, ఆర్యవైశ్య సంఘం, యాదవ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహాలు నిమజ్జనానికి తరలించారు. బోడిచర్ల వద్ద నున్న గుండ్లకమ్మ వాగులో, దూపాడు వద్ద వున్న కాలువలలో విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ బ్రహ్మానాయుడు బందోబస్తు ఏర్పాటు చేశారు.

రాచర్ల : మండలంలోని అనుములవీడు గ్రామంలో జరుగుతున్న వినాయక చవితి వేడుకల్లో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

ఉపాధ్యాయుడు సురేష్‌బాబుకు డాక్టరేట్, సేవారత్న పురస్కారాలు


డాక్టరేట్ అందుకుంటున్న సురేష్‌బాబు

కంభం ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : కంభం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న భూదాల సురేష్ బాబుకు హైదరాబాద్ హోలీ స్పిరిట్ క్రిస్టియన్ యూనివర్సిటీ వారు ఆదివారం గౌరవ డాక్టరేట్ సేవారత్న పురస్కారం ప్రదానం చేశారు. ఉపాధ్యాయుడు సురేష్ బాబు చేసిన సామాజిక సేవను గుర్తించి యూనివర్సిటీ డైరెక్టర్ ప్రెసిడెంట్ ఆయిన డాక్టర్ ఆనంద్ కుమార్ ఈ పురస్కారాలను అందించి ఘనంగా సన్మానించారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి


టీడీపీ నాయకులకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

గిద్దలూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ మండలంలోని ముండ్లపాడు గ్రామానికి చెందిన కార్మికులు గ్రామ ఉపసర్పంచ్, టీడీపీ నాయకులు కడియం శేషగిరికి వినతిపత్రం అందచేశారు. నారాయణ, రాంబాబు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో టీడీపీ నాయకులు సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామన్న హామీ నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు.

టీడీపీ నాయకుడు మృతి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముండ్లపాడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు మండ్ల బుజ్జి అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన మృతదేహాన్ని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి టీడీపీ నాయకులతో కలిసి ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాలులు అర్పించారు. కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

బాలయ్యకు అంతర్జాతీయ గుర్తింపుపై హర్షం

పెద్ద దోర్నాల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : సినీ ప్రస్థానంలో బాలయ్యకు అంతర్జాతీయ గుర్తింపు రావడం హర్షనీయమని బాలకృష్ణ అభిమాన సంఘం నియోజకవర్గం అధ్యక్షుడు ఈదర మల్లయ్య పేర్కొన్నారు. సినిమా రంగంలో 50సంవత్సరాల పాటు, వివిధ రంగాల్లో విస్తృత సేవలు అందించి నందులకు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులో బాలకృష్ణకు చోటు దక్కిన నేపథ్యంలో మల్లయ్య ఆధ్వర్యంలో కేకు కట్ చేసి అభిమానులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో శివ నారాయణ, దేవయ్య, హరికృష్ణ, మోహన్, నవీన్, చిన్నబాబు, దానియేలు, పోలయ్య పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న మల్లయ్య, అభిమానులు



గౌరవ డాక్టరేట్ అవార్డు అందుకుంటున్న దర్శికి చెందిన టీడీపీ నాయకుడు తిరుపతిరావు

తిరుపతిరావుకు గౌరవ డాక్టరేట్

దర్శి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణానికి చెందిన టీడీపీ నాయకుడు సంగా తిరుపతిరావు ప్రతిష్ఠాత్మకమైన గౌరవ డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. అమెరికన్ విజ్‌డమ్ యూనివర్శిటీ, ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ అకాడమీ సంయుక్తంగా నిర్వహించిన రియాల్టీ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు కార్యక్రమంలో ఆయన పేరు నమోదైంది. 30 సంవత్సరాలుగా ఆయన చేసిన సామాజిక సేవలను గుర్తించి ఆ సంస్థలు తిరుపతిరావుకు గౌరవ డాక్టరేట్ అవార్డుకు ఎంపిక చేశారు. తమిళనాడులోని హోసూర్‌లో ఆ సంస్థల ప్రముఖుల చేతులమీదుగా ఆదివారం తిరుపతిరావు గౌరవ డాక్టరేట్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో ప్రతిష్ఠాత్మకమైన అవార్డు లభించటం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానని ఆయన వివరించారు.



నూతన కమిటీతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న గవర్నర్ హరిప్రసాదరావు

లయన్స్ క్లబ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

కురిచేడు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ కురిచేడు నూతన కమిటీ ప్రమాణ స్వీకారం ఆదివారం స్థానిక శ్రీ రాఘవేంద్ర ఉన్నత పాఠశాలలోని సమావేశ మందిరంలో అధ్యక్షుడు వీవీ రమణారావు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న లయన్స్ జిల్లా గవర్నర్ హరిప్రసాదరావు మాట్లాడుతూ లయన్స్ క్లబ్‌లో అంతా సేవా కార్యక్రమాలే ఉంటాయన్నారు. లయన్స్ క్యాబినెట్ సెక్రటరీ నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కురిచేడు క్లబ్ సేవా కార్యక్రమాల్లో ముందున్నదన్నారు. జడ్పీటీసీ నాగిరెడ్డి మాట్లాడుతూ లయన్స్ కమిటీ గ్రామంలో సమస్యల పరిష్కారానికి సహాయ పడాలన్నారు. నూతన అధ్యక్షునిగా ఇందూరి వెంకట నరిసిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా యెలిసెట్టి రంగనాయకులు, కోశాధికారిగా పెండేల ప్రసాదరావు, మరికొంతమంది సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం పేద మహిళలకు చీరలు, విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. జిల్లా గవర్నర్ సీహెచ్ హరిప్రసాదరావు, వీడీజీ రావిపూడి లక్ష్మీనారాయణ, క్యాబినెట్ సెక్రటరీ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, రీజనల్ చైర్మన్ రామారావు, కురిచేడు, దొనకొండ, దర్శి లయన్స్ సభ్యులు పాల్గొన్నారు.

సీహెచ్‌వో నారాయణరావుకు ఘన సన్మానం

ముండ్లమూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీహెచ్‌వోగా పని చేస్తున్న పుల్లంశెట్టి నారాయణరావు ఆదివారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఘనంగా సన్మానించారు. ఈ సన్మానానికి వైద్యాధికారి వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షత వహించగా మరో వైద్యాధికారి జాస్మిన్, డాక్టర్ ప్రవీణ్, నెల్లూరు మెడికల్ అధికారి ఉమామహేశ్వరి, డాక్టర్ జ్యోతి, ఫార్మాసిస్టు యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.



పామూరు ఆకులవీధిలోని వినాయక మండపంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

అమరావతి గ్రౌండ్స్‌లో పర్యావరణ హిత గణేషుని నిమజ్జనం

కనిగిరి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : కనిగిరి పట్టణంలో వినాయక నిమజ్జన వేడుకలు ఆదివారం ఐదవ రోజు ఘనంగా నిర్వహించారు. అమరావతి గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన పర్యావరణహిత మట్టి గణపతిని ఎలాంటి హంగూ ఆర్భాటాలకు తావు లేకుండా ప్రాంగణంలోనే మంచినీటిలో మట్టిగణపతిని తెలుగు మహిళలు నిమజ్జనం చేశారు. అదేవిధంగా స్వామి వారి ప్రసాద లడ్డూను షీప్‌యార్డు డైరెక్టర్ నంబుల కొండయ్య రూ.23వేలకు పాటలో దక్కించుకున్నారు. అదే విధంగా పట్టణంలోని పోలీస్ క్వార్టర్స్‌లో మట్టిగణపతిని వేడుకగా పోలీస్ సిబ్బంది హారతులిచ్చి నిమజ్జనానికి తరలించారు. పాత కూచిపూడిపల్లిలో టీడీపీ



పీసీపల్లిలో వేలంలో సొంతం చేసుకున్న లడ్డూతో మల్లేశ్వరరావు

పట్టణ అధ్యక్షుడు తమ్మినేని శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన గణేషుని విగ్రహానికి నిమజ్జనానికి ముందు ఉత్సవంలా ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు 108 బిందెలతో వారు పోసి ఆధ్యాత్మిక శోభను తెచ్చారు. సాయిబాబా గుడి వీధిలోని గణేషుని విగ్రహ నిమజ్జనం సందర్భంగా ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించి లడ్డూ ప్రసాదానికి వేలం నిర్వహించారు. పట్టణంలోని గణేషుని విగ్ర

వినాయకా వీడ్కోలిక..!

హాల నిమజ్జనానికి ఊరేగింపుగా ప్రతి విగ్రహాన్ని గొల్లపల్లి చెరువు వద్దకు తీసుకు వెళ్లారు. విగ్రహాల నిమజ్జనం వద్ద ఎలాంటి సంఘటనలకు తావు లేకుండా డీఎస్పీ సాయిఈశ్వర్‌యశ్వంత్ ఆదేశాలతో సీఐ ఖాజావలి నేతృత్వంలో ఎస్‌ఐలు శ్రీరాం, మాధవరావులు గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు.

అన్నదానంలో పాల్గొన్న పోలీసులు



ముండ్లమూరులో నిమజ్జనానికి తరలిస్తున్న వినాయకుని విగ్రహం

పట్టణంలోని జీపుస్టాండు వద్ద కారుడ్రైవర్లు, యజమానులు ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ ఖాజావలి, ఎస్‌ఐ టీ శ్రీరాంలు అన్నప్రసాదాన్ని భక్తులకు, ప్రజలకు పెట్టారు. పండుగలు ప్రశాంత వాతావరణంలో అందరూ కలసి ఐకమత్యంగా నిర్వహించుకోవాలన్నారు.

పామూరులో కోలాహలం

పామూరు : పామూరు పట్టణంలో ఐదు రోజుల నుంచి పూజలు అందుకున్న వినాయక విగ్రహాలను ఆదివారం నిమజ్జనానికి భక్తులు అంగరంగ వైభవంగా తరలించారు. పట్టణంలోని ఆకులవీధి శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో మండప కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నదానం నిర్వహించారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. స్థానిక రవికళామందిర్ వద్ద వినాయక మండపంలో నిర్వహించిన లడ్డూ వేలంలో పాల్గొన్న ఎంపీటీసీ బొల్లా నరసింహారావు దంపతులు రూ. 81 వేలకు లడ్డూ పాట పాడి దక్కించుకున్నారు. మరియు హుండీని రూ. 17 వేలకు దక్కించుకున్నారు. నిమజ్జనానికి బయలు దేరిన విగ్రహాలకు బీజేపీ నాయకులు కేవీ రమణయ్య ఆధ్వర్యంలో పూలు చల్లుతూ స్వాగతం పలికారు. నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ ఎం. భీమానాయక్ గట్టి పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. వినాయక విగ్రహాలను స్థానిక పాత చెరువులో నిమజ్జనం చేశారు.

రూ.91వేలు పలికిన గణేశుని లడ్డు

పీసీపల్లి:గణపతి నవరాత్రుల సందర్భంగా మండలంలోని వెంగళాపురం గ్రామంలో ఆదివారం నిర్వహించిన లడ్డూ వేలంపాట ఈసారి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గణపతి స్వామివారి ప్రసాదమైన 5కేజీల లడ్డును వేలంపాటలో గ్రామానికి చెందిన వడ్డెంపూడి మల్లేశ్వరరావు 91వేల రూపాయలకు సొంతం చేసుకున్నారు ఈ సందర్భంగా కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు మల్లేశ్వరరావుకు అభినందనలు తెలిపారు. అలాగే మండలంలోని వెంగళాయపల్లి గ్రామంలో గణేష్ మండపం వద్ద నిర్వహించిన వేలంలో స్వామి వారి లడ్డూను గ్రామానికి చెందిన కోటపాటి రత్తయ్య 51వేలకు పాటపాడి సొంతం చేసుకున్నాడు.

వైభవంగా గణేష్ నిమజ్జనాలు ప్రారంభం

దర్శి: మండలంలో గణేష్ నిమజ్జనాలు వైభవంగా జరుగుతున్నాయి. భారీ ఊరేగింపులతో యువకులు



దర్శిలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహం వద్ద పూజలు చేస్తున్న ప్రముఖ పారిశ్రామిక వేత్త శిద్దా సుధీర్‌కుమార్, ఆర్యవైశ్య సంఘం నాయకులు



పోలీస్‌క్వార్టర్స్‌లో నిమజ్జనంకు తరలిస్తున్న మట్టిగణపతికి పూజలు చేస్తున్న మహిళలు

నృత్యాలు చేస్తూ నిమజ్జనాలకు గణనాథులను తరలిస్తున్నారు. దర్శి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహం నిమజ్జనం సందర్భంగా ఆదివారం ప్రముఖ పారిశ్రామిక వేత్త శిద్దా సుధీర్ పాల్గొని పూజలు చేశారు. ఆయనతో పాటు ఆర్యవైశ్య సంఘం నాయకులు బొగ్గవరపు సుబ్బారావు, అచ్యుత కొండలు తదితరులు పాల్గొన్నారు. పట్టణంలో అనేక వీధుల్లో ఏర్పాటు చేసిన గణేష్ విగ్ర



తూర్పుగంగవరంలో శ్రీవరశిద్ది వినాయక స్వామికల్యాణం చేస్తున్న దంపతులు

హల నిమజ్జనం వైభవంగా జరిగింది.

ఘనంగా వరశిద్ది వినాయక స్వామి కల్యాణం

తాళ్లూరు : తూర్పుగంగవరంలోని గ్రోమోర్ కేంద్రం ఎరుదురుగా ఏర్పాటు చేసిన వినాయకస్వామి విగ్రహం వద్ద శ్రీసిద్ధిబుద్ధి సమేత శ్రీ వరశిద్ధి వినాయక స్వామిశాంతికల్యాణం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఫ్రెండ్స్‌వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పలువురు దంపతులు వినాయక స్వామికి శాంతి కల్యాణం నిర్వహించారు. అర్చకులు శాస్త్రోక్త పూజలు, కల్యాణ క్రతువు జరిపారు. అనంతరం భక్తులకు భారీ అన్న సంతర్పణ, ప్రసాద పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉత్సవకమిటీ సభ్యులు వైఎస్ఆర్‌కెప్రసాద్, సుందరలక్ష్మి దంపతులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆదివారం పూజలు

సీఎస్‌పురం (పామూరు), ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానంలో భక్తులు ఆదివారం అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజ కార్యక్రమాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారికి కుంకుమార్చన పూజలు, విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం దేవస్థాన గాలి గోపురం వద్ద నుంచి స్వామివారికి మహానైవేద్యాన్ని సమర్పించారు. అనంతరం దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

'స్త్రీశక్తి' పథకం సూపర్ సక్సెస్

అధిక సంఖ్యలో మహిళలు బస్సుల్లో ప్రయాణం

దర్శి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రభుత్వం అమలు చేసిన స్త్రీశక్తి ఉచిత బస్సు పథకం సూపర్ సక్సెస్ అయింది. సీఎం చంద్రబాబు పథకం ఆరంభిం నప్పటి నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలు అధికసంఖ్యలో ప్రయాణిస్తున్నారు. ఎన్నికల సందర్భంగా సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు వసతి కల్పిస్తామని ఇచ్చిన హామీని ఆగస్టు 15వ తేదీన ఆరంభించిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఆనందోత్సాహాలతో ప్రయాణిస్తున్నారు. ఏ బస్సులో చూసిన 70 శాతం మంది మహిళలు కనిపిస్తున్నారు. పలుచోట్ల మహిళలు కొంతమంది కూడబలుక్కొని తీర్థ యాత్రలకు కూడా వెళ్లివస్తున్నారు. రాష్ట్రమంతా ఉచితంగా ప్రయాణించే సౌకర్యం కల్గటంతో కొంత మంది శ్రీశైలం వెళ్లి వచ్చారు. అదే విధంగా మరికొందరు ఇతర పుణ్య క్షేత్రాలకు వెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. గుంటూరు, విజయవాడ నగరాల్లోని కళాశాలల్లో దర్శి ప్రాంతంకు చెందిన వందలాది మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అప్పుడప్పుడు విద్యార్థులను చూసేందుకు గతంలో వారి తండ్రులు అధికంగా వెళ్లేవారు. ఎప్పుడో



దర్శిలో ఆర్టీసీ బస్సు వద్ద గుంపులుగా ఎక్కుతున్న మహిళలు

సందర్భం వచ్చినప్పుడు తల్లిదండ్రులు ఇరువురూ వెళ్లేవారు. ప్రస్తుతం చుట్టుప్రక్కల మహిళలు మాట్లాడుతుకొని తమ పిల్లలను చూసి వచ్చేందుకు వెళ్తడటం విశేషం. ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం వసతి కల్పించటం పట్ల అన్నీ వర్గాల మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సైకిల్ సవారీతో ప్రజలకు చేరువ

డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్

కనిగిరి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : సండే సైకిల్ సవారీ కార్యక్రమం పోలీస్ అధికారులు,



బైపాస్‌పై సైకిల్ సవారీ చేస్తున్న డీఎస్పీ, సీఐ, ఎస్ఐ, పోలీసు సిబ్బంది

సిబ్బంది ప్రజలకు చేరువ కావటంతో పాటు మానసిక ఆరోగ్యం లభిస్తుందని డీఎస్పీ సాయిఈశ్వర్‌యశ్వంత్ అన్నారు. డీఎస్పీతో పాటు సీఐ ఖాజావలి, ఎస్ఐ శ్రీరాం, పోలీసు సిబ్బంది ఆదివారం పట్టణంలో సైకిల్‌ను తొక్కుకుంటూ ప్రజలతో కలసి మాట్లాడుతూ తిరిగారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సైకిల్ తొక్కటం పోలీసు సిబ్బందికి ఎంతో శారీరక ధృడత్వం లభిస్తుందన్నారు. నేటి యాంత్రిక జీవనంతో ప్రజల్లో ఆరోగ్యం సన్నగిల్లుతుందన్నారు. అందుకు సైకిల్ తొక్కటం వలన ఆరోగ్యం లభిస్తుందని తెలిపారు.

అదేవిధంగా తాము సైకిల్‌పై వెళ్తూ పట్టణంతో పాటు పట్టణ శివారు రోడ్లు వాటి మలుపులు, ప్రమాదాల నివారణకు పోలీస్‌శాఖ చేపట్టాల్సిన చర్యలు వంటి వాటిపై తమకు అవగాహన లభించే అవకాశం ఉందన్నారు. ఇక నుంచి ప్రతి సండే ఇలాంటి కార్యక్రమాలను చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో కనిగిరి, హెచ్‌ఎంపాడు మండలాల పీఎస్ పరిధిలోని పోలీసు సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర్లు సేవలు మరువలేనివి

ఎంఈవో కాలేషావలి

ముండ్లమూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ వృత్తిలో చేరి వివిధ స్థాయిల్లో పని చేసి చివరికి మండల విద్యా శాఖ అధికారి - 2గా పని చేసి ఆదివారం ఉద్యోగ విరమణ పొందిన కొర్నపాటి వెంకటేశ్వర్లు, పద్మ సుజాత దంపతులను ఘనంగా సన్మానించారు. సన్మాన సభకు సభాధ్యక్షుడిగా ఎంఈవో - 1 షేక్ కాలేషావలి వ్యవహరించారు. స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో జరిగిన సన్మాన సభకు వివిధ మండలాల ఎంఈవోలు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. అనంతరం జరిగిన సభలో హాజరైన వారిని ఉద్దేశించి మండల విద్యాశాఖ అధికారి కాలేషావలి మాట్లాడుతూ పదవీ విరమణ పొందుతున్న వెంకటేశ్వర్లు ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు కే రఘురామయ్య, రమాదేవి, జీ సుబ్బయ్య, ఎల్. సుధాకర్, ఎస్. సాంబశివరావు, షేక్ అమీర్, వస్త్రం నాయక్, కేవీ శ్రీనివాసరావు, సీహెచ్ సుబ్బారావు, వీరాంజనేయులు, ఏ శ్రీనివాసరావు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

ముండ్లమూరు ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా ఎస్‌కే అబ్దుల్ రహీం

మండల ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా ఎస్‌కే అబ్దుల్ రహీంను నియమిస్తూ జడ్పీ సీఈవో ఆదివారం ఉత్తర్వులు పంపారు. ఈయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏవోగా పని చేస్తున్నారు. రెగ్యులర్ ఎంపీడీవోగా పని చేస్తున్న ఎం. శ్రీదేవి నెల రోజుల పాటు బాపట్లలో జరిగే శిక్షణా కార్యక్రమానికి వెళ్లారు. దీంతో ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా అబ్దుల్ రహీంను నియమించారు.

యూరియా విడుదల చేయించాలి

● ఎంపీ మాగుంటకు మన్నేపల్లి సొసైటీ అధ్యక్షుడు గొంది రమణారెడ్డి విన్నపం

తాళ్లూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : యూరియా సక్రమంగా అందక రైతాంగం ఆందోళన చెందుతున్నదని, మన్నేపల్లి సొసైటీకి వెంటనే యూరియావిడుదలకు చర్యలు తీసుకోవాలని ఆ సొసైటీ అధ్యక్షుడు గొంది రమణారెడ్డి(సమర) ఒంగోలులో ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డిని కలిసి విన్నవించారు. నూతనంగా సొసైటీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన రమణారెడ్డి ఆదివారం ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డిని, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీలను మర్యాద పూర్వకంగా కలిశారు. వారిద్దరిని శాలువాలతో సత్కరించారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు ఐ.వెంకటరెడ్డి, షేక్ కాలేషావలి, అనపర్తి ఎఫ్రయిమ్,నాదెండ్ల శ్రీను, తదితరులు ఉన్నారు.



విశేష అలంకరణలో గంగమ్మతల్లి

గంగమ్మకు ప్రత్యేక పూజలు

తాళ్లూరు,ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): గుంటి గంగ సన్నిధిలో ఆదివారం గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. గంగమ్మతల్లి పొంగళ్లు పెట్టి చల్లగా చూడమని వేడుకున్నారు. తాళ్లూరు ప్రాంతంతో పాటు వివిధ ప్రాంతాలనుంచి మొక్కులు తీర్చుకునేందుకు రావటంతో ఆలయ ప్రాంతం భక్తులతో సందడిగా మారింది. గంగమ్మ తల్లిని అధికసంఖ్యలో భక్తులు దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు చేశారు. పలువురు వాహనదారులు వాహన పూజలు చేయించారు.



నాగబాబును సన్మానిస్తున్న దేవకి, సుబ్బారాయుడు

నాగబాబును కలిసిన దేవకి

కనిగిరి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : జనసేన నాయకుడు కొణిదెల నాగబాబును జాతీయ వాసవీ సత్రసముదాయాల చైర్మన్ దేవకి వెంకటేశ్వర్లు ఆదివారం వైజాగ్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. విశాఖపట్నంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న 'సేనతో సేనాని' కార్యక్రమంలో భాగంగా వెళ్లిన దేవకి రాష్ట్ర జనసేన నాయకులు సుబ్బారాయుడుతో కలసి నాగబాబును ఘనంగా సత్కరించారు. రాష్ట్రంలో జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేయాలని నాగబాబు సూచించినట్లు దేవకి పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
3
సోమవారం 1 సెప్టెంబరు 2025





బల్లికురవ : నక్కబొక్కలపాడులో గణేష్ నిమజ్జనంలో పాల్గొన్న మహిళా భక్తులు



చీరాల : పేరాల బాల గణేష్ విగ్రహ నిమజ్జనంలో పాల్గొన్న చిన్నారులు

కోలాహలంగా.. గణేష్ నిమజ్జనాలు

బల్లికురవ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలలో ఏర్పాటు చేసిన 40 గణేష్ విగ్రహాల నిమజ్జన వేడుకలు ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. నక్కబొక్కలపాడు గ్రామంలో మహిళా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. బల్లికురవలో నిమజ్జన వేడుకలలో భాగంగా చి న్నారులు వేసిన కోలాట ప్రదర్శన ఆకట్టుకొంది. కొప్పెరపాడు బొడ్డురాయి సెంటర్‌లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద లడ్డు వేలంలో అదే గ్రామానికి చెందిన యర్రా కోటేశ్వరరావు రూ.1.06 లక్షలకు పాడుకున్నారు. అనంతరం లడ్డుతో గ్రామోత్సవం నిర్వహించారు. అంబడిపూడి, రామాంజనేయపురం, గుంటుపల్లి, చెన్నుపల్లి, సూరేపల్లి గ్రామాలతో పాటు వీర్లకొండ వద్ద శ్రీశ్రీనివాస గ్రానైట్ క్వారీలో ఏర్పాటు చేసిన గణనాథులను ఊరేగించి ఏబీసీ కాల్వలో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో పండుగ వాతావరణం నెలకొంది. పలు గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

బాపట్ల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం కలెక్టరేట్‌లో జరుగుతుందని కలెక్టర్ జె.వెంకటమురళి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో, మండలస్థాయిలోని రెవెన్యూ కార్యాలయాల్లో, రేపల్లె, బాపట్ల, చీరాల డివిజన్ కార్యాలయాల్లో కూడా జరుగుతుందన్నారు. వెబ్‌సైట్ నందు అర్జీలు నమోదు చేసుకోవటానికి మీకోసం.ఏపీ.జీవోవీ.ఇన్ లో నమోదు చేసుకోవచ్చు అన్నారు. అలాగే అర్జీల నమోదు, నమోదైన అర్జీలు, వాటి స్థితి తెలుసుకోవటానికి 1100కు నేరుగా కాల్ చేయవచ్చు అని కలెక్టర్ తెలిపారు.

ఆ చూద్దాంలే

ఈపీటీఎస్‌లో వెనుకబడిన బాపట్ల

సమీక్షించాలని కలెక్టర్లకు ప్రభుత్వ ఆదేశాలు

బాపట్ల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్ పెర్‌ఫార్మెన్స్ ట్రాకింగ్ సిస్టమ్ (ఈపీటీఎస్)లో గుంటూరు జిల్లా రాష్ట్రంలోని మొదటి జిల్లాల్లో ఒకటిగా ఉండేందుకు ప్రయత్నిస్తుండగా బాపట్ల, పల్నాడు జిల్లాలు ఏమాత్రం పోటీ పడటం లేదు. దీంతో ప్రభుత్వం నుంచి ఆయా జిల్లాల అధికారులకు ఈపీటీఎస్ విషయంలో ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రభుత్వ జీవోలు మొదలు అన్ని రకాల డాక్యుమెంట్లు ఎప్పటికప్పుడు ఎలక్ట్రానిక్ పెర్‌ఫార్మెన్స్ ట్రాకింగ్ సిస్టమ్(ఈపీటీఎస్)లో అప్‌లోడింగ్ చేయాలి. విధి నిర్వహణలో ఉద్యోగులకు ఈపీటీఎస్ ఎంతో ఉపయోగకరం. అయితే పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఆయా జీవోలు, డాక్యుమెంట్ల అప్‌లోడింగ్‌లో తాత్సారం నెలకొంది. తాజాగా ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో పల్నాడు జిల్లా 20, బాపట్ల జిల్లా 21వ స్థానంలో ఉన్నాయి. గుడ్ గవర్నెన్స్‌కు ఈపీటీఎస్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఆలోచన చేసి దీనిని ప్రవేశపెట్టినా బాపట్ల జిల్లాలో మరీ తక్కువగా 5248 డాక్యుమెంట్స్‌ని ఈపీటీఎస్‌లో నిక్షిప్తం చేశారు. అదే పల్నాడు జిల్లాకు వచ్చేసరికి అన్నీ కలిపి కూడా కేవలం 8598 డాక్యుమెంట్‌లు మాత్రమే అప్‌లోడింగ్ చేశారు. దీనివల్ల ఆయా జిల్లాల ఉద్యోగులు గుడ్ గవర్నెన్స్‌లో వెనుకబడిపోయే అవకాశం ఉన్నది. ఈ నేపథ్యంలో కలెక్టర్లు దృష్టి పెట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. గుంటూరు జిల్లాలో ఇప్పటివరకు 39,349 డాక్యుమెంట్లను అధికారులు ఈపీటీఎస్‌లో అప్‌లోడింగ్ చేశారు. వాటిల్లో జీవోలు 1369, మెమోలు 800, సర్క్యులర్లు 1291, నోటిఫికేషన్లు 125, లేఖలు 14975, చట్టాలు, నిబంధనలు, క్రమబద్ధీకరణలు 247, విధానపరమైన పత్రాలు 555, తీర్మానాలు 73, ఆడిట్ రిపోర్టులు 281, తీర్పులు 181, ప్రొసీడింగ్స్ 15838, ఇతరత్రా 3614 ఉన్నాయి.

వాన నీటిని పట్టేద్దాం

- వర్షపు నీటి సంరక్షణకు చర్యలు
- భూగర్భ జల మట్టాల పెంపునకు చర్యలు
- చెరువులు, కుంటలు నింపడంపై కార్యాచరణ
- బాపట్ల, పల్నాడు, గుంటూరు జిల్లాల్లో 2,500 పంట కుంటలు

జిల్లాలో 8 గ్రామాలు గుర్తింపు

బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలో గ్రామస్థాయిలో భూగర్భ జల మట్టాలపై ప్రభుత్వం సర్వే చేసింది. బాపట్ల జిల్లాలో భూగర్భ జలాల లభ్యత 3.88 మీటర్ల పరిధిలో నీటిమట్టం ఉన్నట్లు అధికారులు గుర్తించారు.జిల్లా పరిధిలోని 8 గ్రామాల్లో నీటి మట్టం పెంచాలని యంత్రాంగం తేల్చింది. అదేవిధంగా మరీ తీసికట్టుగా భూగర్భ జలాలు ఉన్న గ్రామాలను గుర్తించి తొలి దశలో భాగంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ప్రభుత్వం జిల్లా అధికారులను ఆదేశించింది.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

వానొస్తే వరద. చినుకు పడకపోతే చింత. ఇదీ జిల్లాలో పరిస్థితి. జిల్లా పరిధిలో కృష్ణానది పారుతున్నా అటు సాగు నీరు, ఇటు తాగునీటికి ఇబ్బందులు నెలకొం టున్నాయి. ఈ పరిస్థితుల్లో భవిష్యత్తు నీటి అవసరాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండా లంటే వర్షపు నీటిని ఒడిసిపట్టి జాగ్రత్త చేసు కునే దిశగా ప్రభుత్వం కార్యాచరణ ప్రారంభిం చింది. ఇష్టారీతిన ఇసుక తవ్వకాల వల్ల కూడా భూగర్భ జలమట్టాలలో తగ్గుదల నమోదవుతుం దని, దాని ఫలితమే కృష్ణానది పరీవాహక ప్రాం తాల్లో తీసికట్టుగా నీటిమట్టాలు నమోదవు తున్నట్లు అధికారులు గుర్తించి నివారణ చర్య లపై దృష్టి సారించారు. గ్రామాల వారీగా భూగర్భ జలాల లభ్యతపై క్షేత్రస్థాయిలో కచ్చితత్వంతో కూడిన పరిశీల నకు శ్రీకారం చుట్టింది. గుంటూరు జిల్లాలో 5 మీటర్లు, పల్నాడు జిల్లాలో ప్రమాదకరస్థాయిలో 10.50 మీటర్ల వరక భూగర్భ జలాల నీటి మట్టం ఉన్నట్లు సర్వేలో తేలింది. బాపట్ల జిల్లాలో భూ గర్భ జలాల లభ్యత 3.88 మీటర్ల పరిధిలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ పరిస్థి తుల్లో ఆయా జిల్లాల పరిధిలో మరీ తీసికట్టుగా భూగర్భ జలాలు ఉన్న గ్రామాలను గుర్తించి ఎక్కడికక్కడ ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని ప్రభుత్వం జిల్లా అధికారులను ఆదేశించింది. భూగర్భ జలాల పెంపుపై



గత ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదు. కనీసం ఒక్క ఇంకుడుగుంత కూడా నిర్మించలేదు. ఈ పరిస్థితుల్లో మెట్ట ప్రాంత రైతులు సమృద్ధిగా నీటి లభ్యత లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆ పరిస్థితి ఉండకూడదనే భూగర్భ జలాల పెంపుపై కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది.

సాగునీటి సంఘాలకూ భాగస్వామ్యం

ఆయకట్టు రైతుల ప్రయోజనాలు కాపాడడంతో పాటు కాల్వల నిర్వహణను సమర్థంగా నిర్వహిం చడానికి ప్రభుత్వం ఇటీవలే సాగునీటి సంఘాలను కొలువు దీర్చిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం వర్షపు నీటిని ఒడిసిపట్టడంతో పాటు, వృథాగా సముద్రంలో కలిసిపోయే నీటిని వివిధ మార్గాల ద్వారా సంరక్షించే దిశగా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. ఈ ప్రక్రియలో సాగునీటి సంఘాలకు భాగస్వామ్యం కల్పించనుంది. జలవనరులశాఖ, వ్యవసాయం, రెవెన్యూతో పాటు డ్వామా విభాగంతో సమన్వయం చేసుకుంటూ ప్రణాళికలు పక్కాగా అమలయ్యేలా చూడాల్సిన బాధ్యతను భూగర్భ జలవనరులశాఖకు ప్రభుత్వం అప్పగించింది. బాపట్ల, పల్నాడు, గుంటూరు జిల్లాల పరిధిలో కొత్తగా దాదాపు 2,500 వరకు పంట కుంటలను తవ్వడంతో పాటు ఇంకుడు గుంతలు తవ్వడాన్ని కూడా యుద్ధప్రాతిపదికన చేపట్టేలా అధికారులు కార్యాచరణ రూపొందించి అడుగులు వేస్తున్నారు.

ఇప్పటికే కార్యాచరణ అమలు

జిల్లా పరిధిలోని అద్దంకి నియోజకవర్గ పరిధిలోని కొండల అంచుల వద్ద ఇంకుడుగుంతలు, నీటి, పంట కుంటలను విస్తృతంగా తవ్వించేలా ఇప్పటికే అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. ఉపాధి హామీ పథకం నిధులను ఆయా పనులకు అనుసంధానం చేశారు.

ఆచరణే కీలకం

ప్రభుత్వం భూగర్భ జలాల పెంపు అంశాన్ని మొక్కుబడితంతుగా కాకుండా ఫలితాలు కనబడేలా ఉండాలని ఆదే శించింది. ఇందులో భాగంగా తొలుత కాల్వల కింద ఉన్న చెరువులు, వాగు లు, కుంటలు నింపడం తొలి ప్రాథా మ్యంగా ఎంచుకుంది. వర్షపునీరుతో పాటు వృథాగా వెళ్లే వరదనీటితో వీటి ని నింపేలా ప్రణాళికలు తయారు చేసుకోవాలని యంత్రాంగానికి మార్గ నిర్దేశం చేసింది. ఇదే అంశంపై వివిధ విభాగాల మధ్య సమన్వయం ఏర్పర చడంతో పాటు భవిష్యత్తులో సాగు, తాగునీటి అవసరాలకు ఎలాంటి ఇ బ్బందులు రాకూడదని నిర్దేశించింది. ముందుగా చెరువులు, పంట కాల్వల కట్టలను బలోపేతం చేయడంపై యంత్రాంగం దృష్టి సారించింది.

బీచ్ ఫెస్టివల్‌పై ఎమ్మెల్యే సమీక్ష

చీరాల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): తీరంలో నిర్వహించనున్న బీచ్ ఫెస్టివల్‌పై ఎమ్మెల్యే కొండయ్య ఆదివారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 26 - 28 వరకు వేడుకలు జరిపించేందుకు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధమయ్యాయి. సూర్యలంక, వాడరేవు, రామాపురం ప్రాంతాలను అధికారులు పరిశీలించారు. ఈ క్రమంలో ఆదివారం చీరాల ఎమ్మెల్యే కొండయ్యతో అధికారులు చర్చించారు. సుమారు ఎంతమంది పర్యాటకులు హాజరవుతారు.. ఏ విధమైన కార్యక్రమాలు నిర్వహిస్తే బాగుంటుందనే అంశాలపై ఎమ్మెల్యేతో అధికారులు చర్చించారు. అలాగే తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు అధికారుల విధివిధానాలపై సుదీర్ఘంగా చర్చించారు. కార్యక్రమంలో జేసీ గంగాధర్‌గౌడ్, టూరిజం అధికారి నాగిరెడ్డి, ఏడీ మైనింగ్ రామచంద్రరావు, ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణ నియోజకవర్గ అధికార ప్రతినిధి మహేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.



బీచ్ ఫెస్టివల్‌పై అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

పుట్ట గొడుగులు.. రూ.400



అద్దంకిలోని భవానిసెంటర్‌లో పుట్టగొడుగులు అమ్ముతున్న మహిళలు

అద్దంకి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సహజ సిద్ధ పుట్టగొడుగులకు డిమాండ్ అధికం. ఆహారప్రియులు ఈ పుట్టగొడుగుల కొనుగోలుకు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. మూడు రోజులుగా అద్దంకిలోని భవానిసెంటర్‌లో పుట్టగొడుగుల అమ్మకాలు జోరుగా జరుగుతున్నాయి. 10 నుంచి 15 పుట్టగొడుగులు ఉండే కట్ట రూ.300 నుంచి రూ.400 వరకు విక్రయిస్తున్నారు. నలుగురైదుగురు సభ్యులు ఉండే కుటుంబానికి ఒక పూట పుట్టగొడుగులు కూర తినాలంటే కనీసం రూ.2 వేల వరకు ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

పోలీసుశాఖకు సేవలు అభినందనీయం

- ఎస్పీ తుషార్ డూడీ

బాపట్ల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : సుదీర్ఘకాలంపాటు పోలీసుశాఖకు సేవలందించటం అభినందనీయమని ఎస్పీ తుషార్‌డూడీ తెలిపారు. ఉద్యోగవిరమణ పొందిన పోలీసు సిబ్బందిని ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో సిబ్బందితో కలిసి ఎస్పీ ఘనంగా సత్కరించారు. జిల్లా పీజీఆర్ఎస్ సెల్‌లో ఎస్ఐగా పనిచేసిన బీవీ డేవిడ్, స్పెషల్ బ్రాంచ్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించిన ఎన్ రామకోటేశ్వరరావులు ఉద్యోగ విరమణ పొందారు. కుటుంబసభ్యుల సమక్షంలో వారిని సన్మానించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఏఆర్‌డీఎస్పీ పి.విజయసారధి, వెల్ఫేర్ ఆర్ఐ మౌలుద్దీన్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది ఉద్యోగవిరమణ పొందినవారు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఊరట

- యథావిధిగానే పింఛన్ల పంపిణీ
- రద్దు చేసిన 10,279 బాధితులకు తీపికబురు
- అప్పీలు చేసుకున్నా.. చేసుకోకున్నా కొనసాగింపు

దివ్యాంగుల పింఛన్‌దారుల్లో అనర్హుల ఏరివేతకు ప్రభుత్వం ప్రయత్నించగా అధికారుల నిర్లక్ష్యం అర్హుల పాలిట శాపంలా మారింది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో 10,279 మంది దివ్యాంగులను అనర్హులుగా అధికారులు గుర్తించారు. దీంతో వీరికి సెప్టెంబరు నుంచి పింఛన్ రద్దు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో తమకు పింఛన్ అందదని దివ్యాంగులు ఆందోళనలో ఉన్నారు. అయితే అనర్హుల కంటే అత్యధికంగా అర్హులు పింఛన్ల రద్దు అయిన జాబితాలో ఉన్నారని ప్రభుత్వం గుర్తించింది. దీంతో తమ అర్హతను నిరూపించుకునే అవకాశం ఇవ్వడంతో పాటు యథావిధిగా పింఛన్లను పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించింది. దీంతో పింఛన్‌దారుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి.

గుంటూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పింఛన్ల తొలగింపు విషయంలో ప్రభుత్వం ఒక అడుగు వెనక్కివేసింది. అనర్హతబారిన పడిన వారికి తిరిగి అప్పీలు చేసుకునేందుకు గడువు ఉన్న నేపథ్యంలో సెప్టెంబరులో ఇచ్చే పింఛను పాత పద్ధతిలోనే ఇచ్చేందుకు సిద్ధమైంది. దీంతో అనర్హతబారిన పడిన దివ్యాంగులకు ఈ నెల ఊరట లభిం చింది. గత వైసీపీ ప్రభుత్వంలో దివ్యాంగుల పింఛన్ల జాబితా లో అనేకమంది అనర్హులు అక్రమంగా చొరపడ్డారు. వారిని వడపోయగా గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో 10,279 మంది అనర్హులని తేలింది. మరికొంత మంది వైకల్య శాతం తక్కువగా నమోదు కావడంతో వారిని రూ.15 వేల నుంచి 6 వేల పింఛను జాబితాలో వేసింది. మరికొందరు అనర్హులైన

(మిగతా 6లో)



పాత జాబితా ప్రకారమే పంపిణీ



పాత జాబితా ప్రకారమే సెప్టెంబరులో పింఛను అందజేస్తాం. పింఛన్లు రద్దయిన వారికి కూడా ఈ నెల పింఛన్లు ఇస్తున్నాం. అప్పీలు చేసుకునేందుకు గడువు ఉండడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. పాత జాబితా ప్రకారం ఎంతయితే పింఛను వచ్చిందో.. ఈ నెల కూడా అంతే పింఛను వస్తుంది. ఆందోళన పడవద్దు.

-విజయలక్ష్మి, పీడీ, డీఆర్డీఏ గుంటూరు

చేతి మగ్గం.. అచేతనం

ఉత్పత్తులకు తగ్గిన డిమాండు

మార్టూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): దేశస్థాయిలో గుర్తింపు పొందిన కుప్పడం చీరలను నేసే కార్మికులు వలపర్లలో అత్యధికంగా ఉన్నారు. సాదా రకాలు, కంచిబోర్డరు, డాబి రకాల ఉత్పత్తులను చేతిమగ్గాలపై కార్మికులు నేస్తుంటారు. అయితే పవర్‌లూమ్ ద్వారా తయారైన చీరలు మార్కెట్‌లో రాజ్యమేలుతుండటంతో చేతి మగ్గాల ద్వారా చీరలను తయారుచేయించడానికి మాస్టర్ వీవర్లు ఆసక్తి చూపడంలేదు. దాంతో చేతి మగ్గాల కార్మికులకు పనిలేకుండా పోయింది. ఒక వేళ చేతి మగ్గాలపై చీరలను తయారు చేయించినా కూలి గిట్టుబాటు కావడం లేదు. ఉదాహరణకు వలపర్లలో కుప్పడం చీర తయారీకి చేతిమగ్గందారుడికి 15 ఏళ్లగా రూ.వెయ్యి కూలి ఇస్తున్నారు. ఈ కూలి గిట్టుబాటు కావడంలేదని కార్మికులు చెబుతున్నారు. అదే పవర్ లూమ్ ద్వారా 600 కూలికే కుప్పడం చీర తయారుకావడం విశేషం. వలపర్ల, కోనంకి గ్రామాలలో దాదాపుగా ముప్పావువంతు చేతి మగ్గాలు ఆగిపోయాయి. దాంతో చేనేత కుటుంబాలకు చెందిన పురుషులు బేల్దారి, పెయింట్ పనులకు, గ్రానైట్ పరిశ్రమలలో కార్మికులుగా వెళ్తున్నారు. చేతి మగ్గాలపై తయారైన ఉత్పత్తులకు కొనుగోళ్లు పెరిగితే, మాస్టర్ వీవర్స్ తమకు నేయడానికి చీరలు ఇస్తారని చేతి మగ్గాల కార్మికులు అంటున్నారు.



చేతి మగ్గం ద్వారా తయారయిన చీర



కుప్పడం మగ్గంపై చీరలను నేస్తున్న చేనేత కార్మికురాలు



రూ.25 వేలతో ఆనందం : గంజి శ్రీనివాసరావు వలపర్ల

ఏడాదికి మగ్గందారుడికి రూ.25 వేలు ప్రకటించడం ఆనందంగా ఉంది. మూలనపడిన చేతి మగ్గాలు పనిచేసే దిశగా కార్మికులు పనిచేస్తారు. చేతి మగ్గాలపై తయారయ్యే ఉత్పత్తులకు మార్కెట్లో గిట్టుబాటు ధర కల్పించాలి. వాటి తయారీకి వినియోగించే నూలు,రసాయనాల ధరలను తగ్గించాలి.



గిట్టుబాటు కాని కూలి : గుంటి ఆదినారాయణ వలపర్ల

15 ఏళ్ల క్రితం కుప్పడం చీరను నేస్తే రూ.వెయ్యి కూలి ఇచ్చారు. ఇపుడు కూడా అదే చీరను నేస్తే అంతే కూలి ఇస్తున్నారు. కుటుంబాలు ఎలా బతకాలి. చేతి మగ్గాలపై నేసే వస్త్రాలకు డిమాండు పెరిగేదెప్పుడు. మాకు కూలి పెరిగేదెప్పుడు.

అవీ..ఇవీ..

నేడు మంత్రి గొట్టిపాటి పర్యటన

పంగులూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం మండల కేంద్రమైన పంగులూరులో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు గ్రామంలోని వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు సామాజిక ఫించన్లు పంపిణీ చేయనున్నారు. అనంతరం 11 గంటలకు స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో బాల, బాలికలకు సైకిళ్ల పంపిణీ చేసే కార్యక్రమంలో మంత్రి గొట్టిపాటి పాల్గొంటారని టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బల్లికురవ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నూతన విద్యుత్ లైన్ల ఏర్పాటులో భాగంగా మండలకేంద్రం బల్లికురవలో సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. బల్లికురవతో పాటు పక్కనే ఉన్న కొత్తపాలెం గ్రామానికి కూడా విద్యుత్ సరఫరా ఉండదని ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

గుంటూరు మాధవరావుపై కేసు నమోదు

● వియ్యంకుడుపై దాడి చేయడంతో ఘటన

చీరాల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : చీరాల పట్టణంలో రాజకీయనేతగా గుర్తింపు ఉన్న గుంటూరు మాధవరావుపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొన్నేళ్ల క్రితం ఆయన కుమార్తెను ఈపూరుపాలేనికి చెందిన కూర్మాల శంకరరావు కుమారుడితో లాంఛనంగా వివాహం చేశారు. వారి మధ్య మనస్పర్థలు రావడంతో కేసు కోర్టులో నడుస్తోంది. ఈ నేపథ్యంలోనే శనివారం రాత్రి పట్టణంలోని నల్లగాంధీ బొమ్మ సమీపంలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న వియ్యంకుడు శంకరరావును ఇనుప రాడ్డుతో మాధవరావు దాడిచేసి తీవ్రంగా గాయపరిచాడు. దీంతో బాధితుడు చీరాల్లో ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో గుంటూరుకు తరలించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే మాధవరావు అద్దంకిలో భార్య సహాయంతో అద్దంకి వైద్యశాలలో చేరి అక్కడ ఫిర్యాదు చేశారు.

విద్యుత్‌స్తంభాని ఢీకొని బైకిస్టుకు గాయాలు



గాయపడ్డ డేవిడ్

అద్దంకి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మోటార్‌సైకిల్‌పై వస్తూ విద్యుత్ స్తంభాన్ని ఢీకొని వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు పట్టణంలోని రాజీవ్‌కాలనీకి చెందిన డేవిడ్ ఆదివారం రేణింగవరం వైపు నుంచి మోటార్‌సైకిల్ పై అద్దంకి వస్తూ గరటయ్య కాలనీ వద్ద విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టాడు. గాయపడ్డ డేవిడ్‌ను 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

దివ్యాంగులకు యథావిధిగా పెన్షన్లు

అద్దంకిటౌన్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆగస్టు పెన్షన్‌లు తీసుకున్న దివ్యాంగులందరికి సెప్టెంబరు నెలలోనూ, యాథావిధిగా పెన్షన్లు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో బత్తిన సింగయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నోటీసులు ఇచ్చిన దివ్యాంగులకు కూడా పెన్షన్ల పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. సచివాలయ సిబ్బంది గమనించి అందరికీ యథావిధిగా పెన్షన్లు పంపిణీ చేయాలన్నారు.

స్వచ్ఛాంధ్ర మిషన్ డైరెక్టర్‌గా శ్రీనివాసరావు

● అభినందించిన పలు సాహితీ సంస్థల ప్రతినిధులు

అద్దంకి, ఆగస్టు31 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర మిషన్ డైరెక్టర్‌గా టీడీపీ పట్టణ అధ్యక్షుడు, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ చిన్ని శ్రీనివాసరావును నియమిస్తూ ఉత్తర్వులు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆదివారం పలు సాహితీ సంస్థల ప్రతినిధులు అభినందించారు. రాష్ట్రస్థాయి పదవి దక్కడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. తన నియామకానికి కృషి చేసిన విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. చిన్ని శ్రీనివాసరావును చుండూరి మురళీసుధాకర్, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, యరమోతు శంకరరావు, పూనూరి నరేంద్ర, మన్నం త్రిమూర్తులు అభినందించారు.

హద్దురాళ్ల ట్రాక్టర్ బోల్తా

● తప్పిన పెనుప్రమాదం ● కారంచేడు - చీరాల రోడ్డులో ఘటన



బోల్తాపడిన హద్దు రాళ్ల ట్రాక్టర్

కారంచేడు (పర్చూరు), అగస్టు 31 (ఆంధ్రజ్యోతి) :హద్దురాళ్లతో వెళుతున్న ట్రాక్టర్ బోల్తా పడిన ఘటన ఆదివారం చీరాల - కారంచేడు రోడ్డులో స్థానిక పెట్రోలు బంకు సమీపంలో చోటుచేసుకొంది. మార్టూరు నుంచి హద్దురాళ్లతో చీరాల వెళుతున్న ట్రాక్టర్ వెనుక చక్రం బేరింగ్ విరిగి పోవడంతో ప్రమాదం చోటుచేసుకొంది. దీంతో ట్రాక్టర్‌లో ఉన్న రాళ్లు రోడ్డుపై పడ్డాయి. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటినా ప్రమాద స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు. ఎలాంటి ప్రాణహాని జరగక పోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

నిమజ్జనం చేసిన విగ్రహమే అది..!



వేణుగోపాలస్వామి విగ్రహం

చినగంజాం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మోటుపల్లి సముద్రతీరం వద్ద వేణుగోపాలుడి విగ్రహం ఇటీవలే చినమల్లవరం గ్రామస్థులు నిమజ్జనం చేసినట్లు తెలిసింది. శనివారం ఆ విగ్రహం మోటుపల్లి తీరం వద్దకు రాగా, ఆ వార్త 'ఆంధ్రజ్యోతి' లో ప్రచురితమైంది. ఆ విగ్రహం చూసిన చిన మల్లవరం గ్రామస్థులు తామే ఆ విగ్రహాన్ని నిమజ్జనం చేశామన్నారు. గ్రామంలో గతంలో ఉన్న వేణుగోపాల స్వామి ఆలయం జీర్ణోద్ధరణ అనంతరం నూతన విగ్రహాలను ప్రతిష్ఠించా మన్నారు. చేశామన్నారు. పూర్వవిగ్రహానికి పూజలు నిర్వహించకుండా ఉంచకూడదని పూజారులు తెలపడంతో, ఈ నెల 29న (శుక్రవారం)సాయంత్రం ఐదు గంటల సమయంలో గ్రామంలోని వినాయకుని విగ్రహంతో పాటు వేణుగోపాలస్వామి విగ్రహాన్ని కూడా సముద్రంలో నిమజ్జనం చేసినట్లు ఆ గ్రామానికి చెందిన నాగరాజు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ప్రస్తుతం ఆ విగ్రహం నాగులుప్పలపాడులోని కనపర్తి మ్యూజియానికి చేరింది.

జోనల్ కార్యదర్శిగా పేరిరెడ్డి

ఇంకొల్లు, ఆగస్టు 31,(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రధానోపాధ్యాయుల సంఘం జోనల్ కార్యదర్శిగా ఇంకొల్లు మండలం ఇడుపులపాడు విద్యాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పిడపర్తి పేరిరెడ్డిని ఎన్నుకున్నారు. విజయవాడ లయోలా కళాశాలలో జరిగిన ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో పేరిరెడ్డి రాష్ట్ర జోనల్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. ప్రధానోపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తామని పేరిరెడ్డి అన్నారు. గతంలో బాపట్ల జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం ప్రధాన కార్యదర్శిగా ఆయన పని చేశారు. పేరిరెడ్డి రాష్ట్ర జోనల్ సెక్రటరీ ఎన్నిక పట్ల పలువురు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

గణనీయంగా తగ్గిన మిరప సాగు

● మూతపడ్డ షేడ్ నెట్ నర్సరీలు ● సగానికి పడిపోయిన మొక్కల ధరలు ● సాగుకు విముఖత చూపుతున్న రైతులు



సాగు చేయకుండా వదిలివేసిన షేడ్ నెట్ నర్సరీ

అద్దంకి, ఆగస్టు31 (ఆంధ్రజ్యోతి): మిరప సాగు ఈ ఏడాది గణనీయంగా తగ్గనుంది. దీంతో మిర్చి నారు పెంచే నర్సరీలు పూర్తిగా మూతపడ్డాయి. గత ఏడాది మిర్చి సాగు చేసిన రైతులు తీవ్ర నష్టాలను చవి చూశారు. సాగు చేసేందుకు వెనుకడుగు వేసి ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ నేపథ్యంలో అద్దంకి, సంతమగులూరు, మార్టూరు మండలాలలో సుమారు 50కు పైగా షేడ్‌నెట్ నర్సరీలు ఉండగా వాటిలో సగానికి పైగా పూర్తిగా మూతపడ్డాయి. మిగిలిన వాటిలో మాత్రం కొద్దిమేర మాత్రమే నారు పెంచుతున్నారు. గత ఏడాదితో పోల్చితే పదో వంతు నారు కూడా పెంచడం లేదు. ఇటీవల కురిసిన వర్షాలకు పెద్దఎత్తున మిర్చి మొక్కల నాట్లు వేయాల్సి ఉండగా అక్కడక్కడ మాత్రమే కొద్దిమంది మాత్రమే మిర్చి నాట్లు వేస్తున్నారు. సంతమాగులూరు మండలం లోని కొమ్మాలపాడు, మక్కెనవారిపాలెం తదితర ప్రాంతాలలో మాత్రమే కొంతమేర మిర్చి సాగు చేస్తున్నారు. దీంతో కొమ్మాలపాడు వద్ద ఉన్న నర్సరీ లలో మాత్రమే మిర్చి నారు కొద్దిమేర అమ్మకాలు సాగుతున్నాయి. ఇక అద్దంకి, మార్టూరు మండలాలలో ఉన్న నర్సరీలలో మిర్చి నారు అమ్మకాలు అసలు లేవు. ముందుగానే షేడ్‌నెట్ నర్సరీల నిర్వహకులు రైతులు ఆసక్తిగా లేని విషయాన్ని గుర్తించి నారు పెంపకం పూర్తిగా తగ్గించారు. కొద్దిమేర నారు పెంపకం చేపట్టినా, కొనుగోలు లేకపోవడంతో ధర కూడా సగానికి తగ్గిపోయింది. గత ఏడాది మంచి డిమాండ్ ఉన్న సమయంలో మిర్చి నారు ఒక్కో మొక్క రూ.2 చొప్పున అమ్మకాలు జరగ్గా, ప్రస్తుతం ఒక రూపాయి చొప్పున అమ్మకాలు చేస్తున్నారు. దీంతో కొంత మంది నర్సరీల నిర్వహకులు మా త్రం అసలు పూర్తిగా మూసివేయగా, కొద్దిమంది మాత్రం ఇతర పంటల మొక్కలు పెంపకం చేపడుతున్నారు. బంతి, బొప్పాయి, కూరగాయల మొక్క ల పెంపకం చేపడుతున్నారు.



శ్రీనివాసనగర్‌లోని షేడ్‌నెట్

మిరపనారు పెంపకాన్ని పూర్తిగా తగ్గించాం



రైతులు మిర్చి సాగు పై ఆసక్తి చూపకపోవటంతో షేడ్ నెట్‌లలో నారు పెంపకం పూర్తిగా తగ్గించాం. నాకున్న రెండు నర్సరీలు ఖాళీగా ఉండగా, ఒక దానిలో మాత్రం కొద్దిమేర నారు పెంచుతున్నా. ఏటా 6 ఎకరాలలో రెండు విడతల గా మిరపనారు పెంచేవాళ్లం. ప్రస్తుతం రెండు ఎకరాలలో ఒక విడత కూడా నారు అమ్ముడు పోలేదు. గత ఏడాది ఒక్కో మొక్క ధర రూ.2 ఉంది. ప్రస్తుతం రూపాయి చొప్పున విక్రయించాల్సి వస్తోంది. దీంతో తీవ్రంగా నష్టపోతున్నాం.

దేవినేని కోటేశ్వరావు,షేడ్‌నెట్ నర్సరీ నిర్వహకుడు, శ్రీనివాసనగర్,అద్దంకి

విశ్వబ్రాహ్మణుల అభివృద్ధికి కృషి

విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కమ్మరి పార్వతి



పార్వతమ్మను సత్కరిస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘ నేతలు

పంగులూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలోని విశ్వబ్రాహ్మణుల అభివృద్ధికి కృషిచేస్తానని విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ కమ్మరి పార్వతి అన్నారు. ఆదివారం ఒంగోలు నుంచి విజయవాడ వెళుతున్న ఆమెను రేణంగివరం వద్ద అద్దంకి, పంగులూరు మండలాలకు చెందిన విశ్వబ్రాహ్మణసంఘ ప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. అనంతరం రేణంగివరంలోని శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో చైర్మన్ పార్వతి సంఘ నేతలతో కలసి ప్రత్యేక పూజలు చేశారు. బాపట్ల, ప్రకాశం జిల్లాల విశ్వబ్రాహ్మణుల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ద్వారానే విశ్వబ్రాహ్మణుల అభివృద్ధికి సాధ్యమన్నారు. ఈనెల 17వతేదీన విశ్వకర్మ జయంతిని రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు దంతనాల కనకరత్నాచారి, కోళ్లపూడి సురేష్‌బాబు, కందుకూరి మల్లికార్జునాచారి, వినుకొండ వెంకట సుబ్బారావు, బాపూజి, ఆంజనేయులు, సుధాకర్, వరప్రసాద్, వెంకటేశ్వర్లు, బుచ్చయ్య, శ్రీనివాస్, ఆలయ అర్చకులు ప్రసన్నాంజనేయులు, వీరబ్రహ్మం, బొగ్గవరపు లక్ష్మి పాల్గొన్నారు.

మేదరమెట్ల : విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాన్ని ప్రభుత్వ కార్యక్రమంగా ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ కార్యక్రమాన్ని పండుగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఏపీ విశ్వబ్రాహ్మణ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కమ్మరి పార్వతమ్మను సంఘ జిల్లా నాయకులు కోరారు. కాణిపాక వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని తిరిగి విజయవాడ వెళున్న ఆమెను ఆదివారం మేదరమెట్లలో సంఘ సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లాలోని వి శ్వబ్రాహ్మణులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆ మె దృష్టికి తీసుకువచ్చి పరిష్కారించే దిశగా కృషి చేయాలని కోరారు. రెండురోజులలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లి అందరి అభిప్రాయాలు గౌరవించే విధంగా కార్యక్రమాలు రూపొందిస్తామని చైర్మన్ పార్వతమ్మ హామీ ఇచ్చారు. ఆమెను ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు చెన్నుపల్లి శ్రీనివసచారి, యువజన సంఘం మాజీ అధ్యక్షుడు, టీడీపీ సాధికార కమిటి కన్వీనర్ తువ్వపాటి జనార్దనాచారి, సంఘ నాయకులు ఏలూరి వీ రబ్రహ్మాచారి, పలువురు సంఘ నాయకులు కలిసి ఆమెను శాలువతో సత్కరించారు.

సమావేశం ఏర్పాటుకు సన్నాహం

● గేటుకు తాళాలు వేసి ఉండడంతో నిరసన తెలిపి వెనుతిరిగిన వైనం

● కమ్మ సేవాసమితి సత్రం గేటు వద్ద కొద్దిసేపు హడావుడి



గేటు వద్ద నిరసన తెలుపుతున్న గోపీకృష్ణ, పరిటాల శ్రీను తదితరులు

అద్దంకి, ఆగస్టు31 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ వద్ద ఉన్న కాకతీయ కమ్మసేవా సమితి సత్రం వద్ద ప్రస్తుతం ఉన్న కార్యవర్గానికి వ్యతిరేకంగా ఆదివారం సమావేశం ఏర్పాటు చేసేందుకు పిన్నింటి గోపీకృష్ణ పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం గోపీకృష్ణ ఆధ్వర్యంలో పలువురు కమ్మ సత్రం వద్దకు చేరారు. అయితే ముందుగానే విషయం తెలుసుకున్న కార్యవర్గం సత్రం గేటుకు తాళం వేసింది. దీంతో గేటు ముందే నిరసన వ్యక్తం తెలిపారు. త్వరలో మరోసారి సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు నిరసనకారులు ప్రకటించారు. అదే సమయంలో కోర్టును కూడా ఆశ్రయించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పరిటాల శ్రీనివాసరావు, కూరపాటి వంశీకృష్ణ తదితరులు ఉన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సీఐ సుబ్బరాజు శాంతిభద్రతలు పర్యవేక్షించారు.

కార్మిక, కర్షక ఉద్యమాలను ఉధృతం చేయాలి



మాట్లాడుతున్న కొండారెడ్డి

అద్దంకిటౌన్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నాయని, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు జీవీ. కొండారెడ్డి విమర్శించారు. కార్మిక, కర్షక ఉద్యమాలను ఉధృతం చేసి ప్రజలు పోరాడాలన్నారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో అద్దంకి నియోజకవర్గ స్థాయిలో సీపీఎం కార్యకర్తలకు వర్తమాన రాజకీయాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హజరైన కొండారెడ్డి మాట్లాడుతూ శ్రమశక్తి ద్వారా సంపదను శ్రమజీవులు సృష్టిస్తే ఆ సంపద కొంత మంది వ్యక్తుల చేతులలోకి వెళుతోందన్నారు. ప్రస్తుతం పెట్టుబడిదారి ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో ఉందన్నారు. సంక్షోభానికి వ్యతిరేకంగా కార్మికవర్గం, రైతాంగం, విద్యార్థులు పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. సాయంత్రం జరిగిన కార్యక్రమంలో పార్టీ నిర్మాణం-కర్తవ్యాలు అనే అంశంపై పార్టీ జిల్లా నాయకులు సీహెచ్ మజుందార్ మాట్లాడారు. జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో టౌన్ కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

శతాబ్ది ఉత్సవాల సంచిక ఆవిష్కరణ

● అలరించిన అమెరికా యువతి భరతనాట్య ప్రదర్శన

● అందరినీ ఉత్సాహపరిచిన పావలా నాటిక



శతాబ్ది ఉత్సవాల సంచికను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

వేటపాలెం(చీరాల), ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : శ్రీ బాలభక్త సమాజం, విద్యా గణపతి ఆలయం ఆధ్వర్యంలో శతాబ్ది ఉత్సవాల సంచిక ఆవిష్కరించారు. బండ్ల బాపయ్య విద్యాసంస్థల కమిటీ అధ్యక్షులు అంకయ్య, రోటరీ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు సీతారాం ముఖ్య అతిథులుగా కార్యక్రమానికి హాజరై ఉపన్యసించారు. అయితే ఈ సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో యూఎస్‌ఏ యువతి శివానీ ప్రదర్శించిన భరతనాట్యం అందరినీ అలరించింది. అంతేకాకుండా డా.నరాలశెట్టి రవి కుమార్ బ్రహ్మనాయుడు ఏకపాత్రాభినయంతో అందించిన పావలా నాటిక అందరినీ ఉత్సాహ పరిచింది. కార్యక్రమాన్ని శివప్రసాద్, వీరమల్లు, బట్టా మోహన్‌రావు, విశ్వంభరానందగిరి స్వామి, నాగమాంబ పర్యవేక్షించారు.

నాణ్యమైన పొగాకునే తీసుకురావాలి



సమావేశంలో పాల్గొన్న అధికారులు

పర్చూరు, అగస్టు 31 (ఆంధ్రజ్యోతి) :జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నాణ్యమైన పొగాకును మాత్రమే కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చేలా రైతులకు అవగాహన కల్పించాలని బాపట్ల జిల్లా మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ అన్నారు. ఆదివారం స్థానిక రోటరీక్లబ్‌లో గ్రేడింగ్ విధానంపై అధికారులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డీఎం మాట్లాడుతూ నాణ్యతలేని పొగాకును కొనుగోలు కేంద్రానికి తీసుకురావడం వలన ఎక్కువ చెక్కులను రైతులు వెనక్కి తీసుకుపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. దీంతో రైతులు నష్టపోవాల్సి వస్తుందన్నారు. గ్రామస్థాయిలో వీఏఏలు రైతులకు సరైన అవగాహన కల్పించకపోవడం వల్లే సమస్యగా మారిందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని పండాకు, పచ్చగుల్ల ఆకు, బూజుపట్టిన ఆకు, బొగులు ఆకు లేకుండా గ్రేడింగ్ చేసుకొని కొనుగోలు కేంద్రానికి తీసుకు వచ్చే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి సుబ్రహ్మణ్యం, అదనపు డిప్యూటీ కలెక్టర్ లవన్న, మార్క్‌ఫెడ్ ప్రాజెక్టు మేనేజర్ రమేష్, అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ సుబ్రహ్మణ్యం, ఏడీఏలు, ఏవోలు పాల్గొన్నారు.

గుండెపోటుతో టీడీపీ నేత మృతి

● నివాళి అర్పించిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



పవన్‌కుమార్ (ఫైల్)

యద్దనపూడి,(పర్చూరు)ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): టీడీపీ తెలుగు ప్రొఫెషనల్ వింగ్ పర్చూరు నియోజకవర్గ అధ్యక్షులు వెంపరాల జితేంద్ర పవన్ కుమార్ (27)గుండె పోటుతో ఆకస్మికంగా మృతిచెందాడు. యద్దనపూడి మండలం చింతపల్లిపాడు గ్రామానికి చెందిన శ్రీనివాసరావు, మాధురి దంపతుల పెద్దకుమారుడు పవన్‌కుమార్, శనివారం సాయంత్రం గ్రామంలోని యువకులతో కలిసి ఉన్న సమయంలో అకస్మాత్తుగా అస్వస్థకు గురయ్యాడు. వెంటనే అతనిని కుటుంబసభ్యులు చిలకలూరిపేటలోని ప్రవేటు ఆస్పత్రి కి తరలించగా, అక్కడ ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం గుంటూరుకు తరలించాలని వైద్యులు చెప్పారు. దీంతో గుంటూరులోని కాటూరి ఆస్పత్రికి తరలించగా, అక్కడ తీవ్రస్థాయిలో గుండెపోటుకు గురై పవన్ మృతిచెందాడు. టీడీపీలో చురుకుగా వ్యవహరించే పవన్ మృతిచెందడంతో నాయకులు కార్యకర్తలు విషాదంలో మునిగారు. మృతదేహాన్ని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సందర్శించి నివాళి అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కామేపల్లి హరి బాబు,గుదే తారకరామారావు, మిన్నెకంటి రవికుమార్, నల్లపనేని రంగయ్యచౌదరి, తదితరులు పాల్గొన్నారు.

నేత్ర వైద్యశిబిరం ఏర్పాటు అభినందనీయం



వైద్యశిబిరానికి హాజరైన ప్రజలు

బల్లికురవ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలలో శంకర్ నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరాలను ఏర్పాటు చేయటం అభినందనీయం అని సంతమాగులూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దేవినేని నరేంద్ర అన్నారు. ఆదివారం మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామంలో గుంటూరు పెదకాకానికి చెందిన శంకర్ నేత్రాలయం ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు శ్రద్ధ ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి 25 మందికి శుక్లాల అపరేషన్లు అవసరం అని గుర్తించారు. వారికి ఉచితంగా అపరేషన్లు చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం డీసీ వైస్ చైర్మన్ కక్కెర సుబ్బారావు, మాజీ సర్పంచ్ అమరనేని కాశీవిశ్వనాథం, గ్రామ పెద్దలు చిట్టిపోతు నరేంద్ర, అమరనేని వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనాలు



అద్దంకి నుంచి తరలి వెళుతున్న గణనాథుడు

చీరాల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గం పరిధిలో నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది సబ్ డివిజన్ పరిధిలో 1065 మండపాలకు పోలీసులు అనుమతులు ఇచ్చారు. ఈక్రమంలోనే కొద్ది రోజులుగా నిమజ్జనాల సంఖ్య క్రమేపీ పెరుగుతూనే ఉంది. అయితే ఆయా ర్యాలీల సమయంలో కొన్నిచోట్ల భక్తులు హద్దులు దాటుతున్నారు. శృతి మించిన డీజేల శబ్దాలతో రణభేరి మోగిస్తున్నారు. దీంతో వృద్ధులు, చిన్నారులు, గుండె సంబంధిత వ్యాధిగ్రస్థులు భయాందోళన చెందుతున్నారు.

అధికారులు నిమజ్జనాల పరిశీలన

ఈపూరుపాలెం స్ట్రయిట్‌కట్ కాలువ నుండి వాడరేవు, రామాపురం, విజయలక్ష్మీపురం, పొట్టిసుబ్బయ్యపాలెం, కఠారిపాలెం వరకు నిత్యం నిమజ్జనాలు జోరందుకున్నాయి. ఈక్రమంలో ఆదివారం ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు, తహసీల్దార్ గోపీకష్ణ తదితర అధికారులతో పరిశీలించారు. సూర్యాస్తమం లోపే నిమజ్జనాలు చేయాలని డీఎస్పీ మొయిన్ సూచించారు.

అద్దంకి : వినాయక విగ్రహాల నిమజ్జనం ఆదివారం వైభవంగా నిర్వహించారు. అద్దంకి పట్టణంలో వివిధ ప్రాంతాలలో ఏర్పాటు చేసిన 20 విగ్రహాలు, మండలంలోని పలు గ్రామాలలో ఏర్పాటు చేసిన 30 గ్రామాలలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల నిమజ్జనం ఆదివారం జరిగాయి. సీఐ సుబ్బరాజు ఆధ్వర్యంలో డ్రోన్ కెమెరాలతో నిమజ్జన ఊరేగింపుల వద్ద నిఘా ఏర్పాటు చేశారు. అద్దంకి పట్టణంలోని దర్శి రోడ్డు లో ఏర్పాటు చేసిన వినాయక వి గ్రహం వద్ద కోలాటం ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నాగులపాడు రోడ్డులోని శివసాయి రెసిడెన్సీ వద్ద వినాయక విగ్రహం వద్ద పిల్లలకు క్విజ్ పోటీలు నిర్వహించి నగదు బహుమతులు అందజేశారు.



పర్చూరు నుంచి నిమజ్జనానికి తరలుతున్న విగ్రహం

పర్చూరు : యద్దనపూడి మండలం పెద్ద జాగర్లమూడి గణనాథుని విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వినాయక చవితి పండుగ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ఆదివారం భారీ ఎత్తున తాళాలు, దప్పువాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించారు. చీరాల వాడరేవుకు తరలించారు. పర్చూరు బొమ్మల సెంటర్ కూడలిలో పెద్ద ఎత్తున వేడుకలు చేపట్టారు. పర్చూరులోని జయంతి కాలనీ, లక్ష్మీపురం, శ్రీ వాసవీకన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం, సబ్‌రిజిస్ట్రార్ ఆఫీస్ వీధి, స్థానిక శారదా హైస్కూల్ సమీపంలో చిన్నారులు ఏర్పాటు చేసుకున్న గణనాధుల విగ్రహాలను పూజా కార్యక్రమాల అనంతరం నిమజ్జనానికి తరలించారు.

బల్లికురవ : వినాయక నిమజ్జన వేడుకల లో భాగంగా చిన్నారులు వేసిన కోలాట ప్రదర్శన ఆకట్టుకొంది. అలానే కొప్పెరపాడు బొడ్డురాయి కూడలిలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద లడ్డును అదే గ్రామానికి చెందిన యర్రా కోటేశ్వరరావు రూ. 1.06 లక్షలకు పాట పాడి లడ్డును గ్రామోత్సవం నిర్వహించారు. అలానే వీర్లకొండ వద్ద శ్రీ శ్రీనివాస గ్రానైట్ క్వారీలలో ఏర్పాటు చేసిన గణనాధులను పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించి సమీపంలో ఉన్న ఏబీసీ కాలువలో నిమజ్జనం చేశారు.

పట్టుబడిన అక్రమ రేషన్ బియ్యం



పట్టుబడిన వాహనం

చీరాల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తుండగా పోలీసులకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మున్సిపల్ పరిధిలోని వైకుంఠపురానికి చెందిన షాపు నెంబర్ 32లో ఆ షాపు నిర్వాహకుడు హెలెన్ అక్రమంగా 40 బస్తాల బియ్యంను టాటా ఏస్ వాహనంలో లోడ్ చేసి తరలించే ప్రయత్నం చేశాడు. అయితే స్థానికుల సమాచారం మేరకు వన్‌టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొన్నారు. పోలీసుల రాకను గ్రహించిన డీలర్ హెలెన్ అక్కడి నుండి పరారయ్యాడు. దీంతో పోలీసులు వాహనం స్వాధీనం చేసుకున్నారు. రెవెన్యూ అధికారుల సహాయంతో కేసు నమోదు చేశారు. పంపిణీ ప్రారంభం కాకుండానే బియ్యం నల్లబజారుకు తరలే ప్రయత్నం జరుగుతుండటంపై సర్వత్ర విమర్శలు గుప్పిస్తున్నాయి.

దివ్యాంగులకు ఊరట

(5వ పేజీ తరువాయి)

వయోవృద్ధులను సాధారణ పింఛను జాబితాలో వేసింది. అయితే ఈ జాబితాలో అనర్హులతోపాటు కొందరు అర్హులు కూడా పింఛను కోల్పోయారు. ఈ నేపథ్యంలో దివ్యాంగుల్లో కలవరం మొదలైంది. అధికారుల వద్దకు పరుగులు పెట్టారు. దీంతో ప్రభుత్వం వారికి తిరిగి అప్పీలు చేసుకునే అవకాశం కల్పించింది. వారి వైకల్య స్థాయిని పునః పరిశీలించేందుకు మరోమారు అప్పీలు చేసుకునే సదుపాయం కల్పించింది. దీంతో పెద్దసంఖ్యలో అభ్యర్థనలు వచ్చాయి. అప్పీలు చేసుకునేందుకు గడువు కూడా ఉండడంతో పాత పద్ధతిలోనే పింఛను ఇచ్చేందుకు నిర్ణయించింది. బాధితులు అప్పీలు చేసుకున్నా, చేసుకోకున్నా వారికి యథావిధిగా పింఛన్లను కొనసాగించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పింఛన్లు తొలగిస్తూ విడుదల చేసిన కొత్త జాబితాపై ఆందోళనలు వెల్లువెత్తడంతో పాత జాబితా మేరకే పింఛన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆ మేరకు పాత జాబితాను తిరిగి విడుదల చేయడంతోపాటు, ఆ జాబితాకు అను గుణంగా నగదును బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. గతంలో మాదిరిగానే లబ్ధిదారులు రూ.15 వేలు, రూ.6వేలు చొప్పున పింఛన్లు అందుకోనున్నారు. ఇస్తున్నారు. తాజాగా పేర్లు తొలగించిన 10,279 మందికి కూడా అదే పద్ధతిలో పింఛన్లు అందించాలని ఆయా జిల్లా అధికారులను ప్రభుత్వం ఆదేశించింది.



రామేశ్వరం వెళ్లినా శనేశ్వరం వదల్లేదన్న సామెతగా మారింది వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) రోడ్ల పనుల పరిస్థితి. వైసీపీ ప్రభుత్వం పోయి ఏడాది గడిచినా ఇంతవరకూ ఆ వర్కులకు పట్టిన గ్రహణం వీడలేదు. ఈ వర్కుల విషయంలో స్పష్టమైన నిర్ణయం తీసుకోవడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. అసలు ఈ వర్కులు జరుగుతాయా? లేదా? అన్నది కూడా ప్రశ్నార్థకంగానే మారింది. మూడేళ్లు గడిచినా ఏఎంసీ వర్కులకు హెడ్ ఆఫ్ అకౌంట్ లేదు. ఇప్పటివరకూ చేసిన పనులకు బిల్లుల చెల్లింపు ఊసే కనిపించడం లేదు. జిల్లాలోని కీలక కనెక్టివిటీ రోడ్లన్నీ ఈ జాబితాలోనే ఉన్నాయి. వాటిని బాగు చేస్తారా? లేదా? అంటూ ఇటీవల జరిగిన జిల్లా రివ్యూ కమిటీ (డీఆర్సీ) సమావేశంలోనూ ఎమ్మెల్యేలంతా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులను నిలదీశారు. ఈ వర్కుల విషయంపై అధికారులు కూడా అనేక సార్లు రాష్ట్ర ఉన్నతాధికారులకు నివేదించారు. అయినా ఎటువంటి స్పష్టత రాలేదు. దీంతో ఏఎంసీ జాబితాలో ఉన్న రోడ్లను మరో ఫండ్ కింద అయినా బాగు చేయాలా!? లేదా!? అన్న సందిగ్ధంలో పంచాయతీరాజ్ అధికారులు ఉన్నారు.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)

ఏడాదైనా నిర్ణయమేది!?

- ఏఎంసీ వర్కులపై ఎటూ తేల్చని ప్రభుత్వం
- కీలక రోడ్లన్నీ ఆ జాబితాలోనే!
- ఆ 171 వర్కులు ఉన్నట్టా.. లేనట్టా!?
- చేసిన 25 రహదారి పనులకూ బిల్లులేవీ?
- డీఆర్సీలోనూ ఇదే అంశంపై సుదీర్ఘ చర్చ



కలువాయి : దారుణంగా దెబ్బతిన్న గోపవరం రోడ్డు

ఏఎంసీ నిధులతో రోడ్లను బాగు చేస్తున్నామని నాడు గొప్పగా ప్రచారం చేసుకున్న వైసీపీ ప్రభుత్వం చివరకు చేతులెత్తేసింది. ఆ ప్రభావం ఇప్పటికీ కొనసాగుతోంది. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 222 రోడ్లను రూ.185.40 కోట్లతో అభివృద్ధి చేసేలా పీఆర్ అధికారులు ప్రతిపాదనలు తయారు చేశారు. మొత్తం 591 కిలోమీటర్ల రోడ్లను 34 ప్యాకేజీలుగా విభజించి 2022, జూన్‌లో తొలిసారిగా టెండర్లు పిలిచా రు. మొదటి నుంచీ ఈ వర్కులకు నిధులపై స్పష్టత లేకపోవడంతో కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. 176 పనులకు మాత్రమే కాంట్రాక్టర్లు టెండర్లు వేయగా, మిగిలిన 46 పనులకు స్పందన లేదు. వీటిలో 51 పనులను మొదలు పెట్టగా 26 రోడ్డు పనులను పూర్తి చేశారు. మరో 25 పను లు వివిధ దశల్లో ఆగిపోయి ఉన్నాయి. మొత్తంగా 171 పనులు అసలు జరగలేదు. గతేడాది ఆర్థిక శాఖ జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం ప్రారంభం కాని పనులను రద్దు చేయాల్సి ఉంది. అయితే ఈ విషయంలో కూడా స్పష్టత లేదు. ఈ 171 రోడ్డు పనులు ఉన్నట్లా.. రద్దయినట్లా..? అన్నది కూడా స్పష్టంగా తెలియడం లేదు.

ప్రజలకు తప్పని అవస్థలు

ఉమ్మడి జిల్లాలో కీలకమైన రోడ్లను ఏఎంసీ నిధులతో అభివృద్ధి చేసేందుకు అనుమతించడంతో ఆ రోడ్లను వేరొక నిధులతో అభివృద్ధి చేయలేని పరిస్థితి నెలకొంది. ఈ రోడ్లను బాగు చేసేందుకు ఇప్పటికీ బడ్జెట్ కేటాయించలేదు. బ్యాంకుల నుంచి రుణం రాకపోగా, దీనిపై ప్రభుత్వం కూడా ఇంత వరకూ ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. ఇప్పటి వరకూ చేసిన పనులకు కూడా కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వలేదు. దీంతో వారు కొత్తగా పనులు చేసేందుకు ముందుకు రావడంలేదు. దీంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. గ్రామీణ కనెక్టివిటీ రోడ్లను బాగు చేయాలని 2022లో టెండర్లు పిలిచే నాటికే ఆ రోడ్లు దారుణంగా దెబ్బతిని ఉన్నాయి. ఈ మూడేళ్లలో ఇంకా గుంతలమయంగా మారాయి. కొత్తగా రోడ్లు వేసేది అటుంచితే కనీసం ప్యాచ్‌లు వేసే పరిస్థితి కూడా లేకుండా పోయింది. అసలు ప్రారంభం కాని 171 రోడ్డు పనుల విషయంలో త్వరగా ఏదో ఒక నిర్ణ యం తీసుకొని వాటిని బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

భారీ పరిశ్రమల వైపు అడుగులు

- ముందుకొచ్చిన ఇఫ్కో, అంబానీ, అదానీ సంస్థలు
- రూ.3291 కోట్ల పెట్టుబడి.. 44,285 మందికి ఉపాధి
- ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం

నెల్లూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భారీ పరిశ్రమల ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నాయి. ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని వ్యాపారవేత్తలను ఒప్పిస్తుండడంతో ఫలితాలు వస్తున్నాయి. తాజాగా మూడు భారీ ప్రాజెక్టులు నెలకొల్పేందుకు మూడు సంస్థలు ముందుకువచ్చాయి. ఇఫ్కో కిసాన్ సెజ్, ధీరూబాయ్ అంబానీ గ్రీన్‌టెక్ పార్కు, అదానీ విల్మర్ సంస్థలు జిల్లాలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయి. కృష్ణపట్నం సమీపంలో గతంలో పవర్ ప్లాంటు నిర్మాణం కోసం రిలయన్స్‌కు కేటాయించిన సుమారు 2500 ఎకరాల భూములు ఇప్పుడు వినియోగంలోకి రాబోతున్నాయి. ఈ భూముల్లో ధీరూబాయ్ అంబానీ సంస్థ గ్రీన్ టెక్ ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. రూ.1,843 కోట్లతో ఇక్కడ పార్కును ఏర్పాటు చేసి, 19 వేలమందికి ఉపాధి కల్పించే లా ప్రతిపాదనలు అందజేసింది. అలానే కొడవలూరు మండలంలోని ఇఫ్కో కిసాన్ సెజ్ భూములు కూడా రెండు దశాబ్దాల వివాదాల అనంతరం వినియోగంలోకి రానున్నాయి. ఈ భూములకు సంబంధించిన వివాదం ఇటీవల హైకోర్టులో పరిష్కారమైంది. దీంతో ఇక్కడ పరిశ్రమలు నెలకొల్పేందుకు మార్గం సుగమమైంది. ఈ క్రమంలో ఇఫ్కో కిసాన్ సెజ్ సంస్థ రూ.870 కోట్లతో ప్రాజెక్టు చేపట్టేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ఈ ప్రాజెక్టు ద్వారా 25 వేలమందికి ఉపాధి లభించనున్నదని ఆ సంస్థ పేర్కొంది. అలానే అదానీ విల్మర్ సంస్థ కూడా జిల్లాలో రూ.578 కోట్ల పెట్టుబడితో భారీ పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు సిద్ధమైంది. వ్యవసాయ ఉత్పత్తుల ఆధారిత పరిశ్రమను ఏర్పా టు చేసేందుకుగానూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ఈ పరిశ్రమ ద్వారా 285 మందికి ఉపాధి దొరుకుతుందని తన ప్రతిపాదనల్లో ప్రస్తావించింది. మొత్తంగా ఈ మూడు సంస్థలు రూ.3291 కోట్ల పెట్టుబడితో 44,285 మందికి ఉపాధి కల్పించేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాయి. ఈ ప్రతిపాదనలకు రాష్ట్ర స్థాయి పరిశ్రమల ప్రోత్సాహక బోర్డు ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన ఇటీవల జరిగిన బోర్డు సమావేశంలో కొత్త పరిశ్రమల ఏర్పాటుపై చర్చించారు.



నెల్లూరు మినీ బైపాస్ రోడ్డులోని ఇఫ్కో కిసాన్ సెజ్ ప్రాజెక్టు కార్యాలయం

అందరిలోనూ దేశభక్తి, దైవభక్తి పెరగాలి

- పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- 10 అడుగుల వినాయక విగ్రహం ఆవిష్కరణ
- వైభవంగా గణేశ్ నిమజ్జనం

నెల్లూరు (సాంస్కృతికం) ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : అందరిలోనూ దేశభక్తి, దైవభక్తి పెరగాలని పూర్వ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు అన్నారు. ఆదివారం రాత్రి నగరంలోని స్వర్ణాల చెరువు గణేశ్ ఘాట్‌లో నిర్వహించిన వినాయక నిమజ్జనానికి సతీమణితో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మాట్లాడుతూ రానున్న తరాలకు తల్లిదండ్రులు దేశభక్తిని, దైవభక్తిని నేర్పించాలని కోరారు. గణేశ్ ఉత్సవాలను అందరూ జరుపుకోవాలని కోరారు. గణనాథుడ్ని పూజిస్తే అన్నీ విఘ్నాలు తొలగి, ప్రజలు సుభిక్షంగా ఉంటారని పేర్కొన్నారు. జీవనదులను కాపాడుకుంటే పంటలు పండుతాయని, దేశం అభివృద్ధి చెందుతుందని, కాబట్టి ప్రతి ఒక్కరూ నీటిని వృథా చేయకుండా, పొదుపుగా వాడుకోవాలన్నారు. త్వరలోనే భారత్ ప్రపంచంలో రెండువ ఆర్థికశక్తిగా ఎదుగుతుందని చెప్పారు. ఈ సభలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, స్వర్ణభారత్ ట్రస్ట్ ట్రస్టీ దీపమ్మ, గణేష్ ఉత్సవ సమితి రాష్ట్ర అధ్యక్షుడు భయ్యా శ్రీనివాసులు తదితరులు ప్రసంగించారు.

వినాయక విగ్రహం ఆవిష్కరణ

స్వర్ణాల చెరువులో ఏర్పాటు చేసిన 10 అడుగుల వినాయక విగ్రహానికి ఎం. వెంకయ్యనాయుడు దంపతులు, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధరరెడ్డి, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, దీపావెంకట్ దంపతులు భక్తిశ్రద్ధలతో పూజలు చేసి ఆవిష్కరించారు. అనంతరం స్వర్ణలింగేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన మృతిగా గణపతి విగ్రహానికి శోభాయాత్ర నిర్వహించి ఘాట్‌కి తీసుకువచ్చారు. వేదపండితులు వేదగిరి ఫణిశర్మ ఆధ్వర్యంలో అర్చకులు గంగాహారతి ఇచ్చారు. వెంకయ్యనాయుడు దంపతులతోపాటు వేలాదిమంది భక్తులు చూసి గంగా హారతిని తిలకించి తరలించారు. అనంతరం గణేశ్ నిమజ్జనం జరిగింది. మూలాపేటలోని గణేశ్‌ఘాట్‌ను విద్యుత్ దీపాలంకరణలతో శోభాయమానంగా అలంకరించారు. భారీ క్రేన్‌తోపాటు నాలుగు క్రేన్‌లను కూడా గణేశ్ విగ్రహాల నిమజ్జనం కోసం ఏర్పాటు చేశారు. మిరుమిట్లు గొలిపే బాణసంచా వేడుకలు కనువిందు చేశాయి. నెల్లూరు నగరం నలుమూలల నుంచి వేలాది గణపతులు నిమజ్జనానికి తరలివ చ్చాయి. స్వర్ణాల చెరువు గణేశ్ ఘాట్‌తోపాటు రంగనాయకులపేట పెన్నాఘాట్‌లోనూ నిమజ్జనాలు జరిగాయి. ఈ కార్యక్రమాల్లో విక్రమ సింహపురి గణేశ్ ఉత్సవ కమిటీ నేతలు, బీజేపీ నాయకులు పీ.సురేంద్రరెడ్డి, ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి, పలువురు బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



స్వర్ణాల చెరువు ఘాట్‌లో పది అడుగుల గణేశ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన వెంకయ్యనాయుడు, ఎమ్మెల్యే సోమిరెడ్డి, నుడా ఛైర్మన్ శ్రీనివాసులురెడ్డి తదితరులు

నెల్లూరు : వినాయక నిమజ్జనోత్సవం సందర్భంగా గణేశ్ ఘాట్‌లో నిర్వహించిన గంగాహారతి





నెల్లూరు : స్వర్ణలింగేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన మృతిగా గణపతి శోభాయాత్ర

పౌష్టికాహార లోపంతో మృత్యువాత

- జిల్లాలో ఎంతోమంది తల్లులు, చిన్నారుల మరణం
- పిల్లల ఎదుగుదలకు పోషకాహారం ఎంతో అవసరం
- ప్రజలకు అవగాహన కల్పించేలా విస్తృత ప్రచారం
- నేటి నుంచి జాతీయ పౌష్టికాహార వారోత్సవాలు

నెల్లూరు (వైద్యం) ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, చిన్నారుల ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో అవసరం. పోషకాహారం అందక జిల్లాలో ఎంతోమంది తల్లులతోపాటు చిన్నారులు మృత్యువాత పడుతున్నారు. గత జనవరి నుంచి ఇప్పటివరకు 62 మంది చిన్నారులు, 19 మంది తల్లులు మృతి చెందారంటే జిల్లాలో గర్భిణులు, చిన్నారుల పరిస్థితి ఎలా ఉందో తెలుస్తోంది. ఈ నేపథ్యంలో సెప్టెంబరు ఒకటి (నేటి) నుంచి 7వరకు జాతీయ పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా జిల్లాలో విస్తృతంగా వైద్య ఆరోగ్యశాఖ ప్రచారం నిర్వహించాల్సి ఉంది.

ప్రత్యేక చికిత్సలు చేస్తున్నా..

జిల్లాలోని 2,934 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఆరేళ్ల ఏళ్లలోపు 1,33,207 మంది చిన్నారులకు, 13,819 మంది గర్భిణులకు, 11,503 మంది బాలింతలకు పౌష్టికాహారాన్ని ప్రభుత్వం అందిస్తున్నది. నెల్లూరు జీజీహెచ్‌లో 30 పడకలతో ప్రత్యేక పౌష్టికాహార కేంద్రమే ఉంది. అలాగే 50 పడకలతో ప్రత్యేక ఎస్ఎన్‌సీయూ ఏర్పాటు చేశారు. ఇక్కడ బరువు తక్కువగా ఉన్న చిన్నారులకు ప్రత్యేక చికిత్స అందిస్తున్నారు. ప్రతి ఏటా జిల్లాలో 45 వేల ప్రసవాలు జరుగుతున్నాయి. ఇందులో ప్రభుత్వ ఆసుపత్రులలోనే 12 వేల వరకు ప్రసవాలు జరుగుతున్నారు. ఈ క్రమంలో పౌష్టికాహార లోపంతో ఎక్కువ మంది చిన్నారులు మృత్యువాత పడుతున్నారు.

36శాతం చిన్నారుల్లో ఎదుగుదల లోపం

పౌష్టికాహారలోపం కారణంగా 36శాతం మంది చిన్నారుల్లో ఎదుగుదల లోపిస్తున్నది. ప్రత్యేకంగా వీరికి వైద్య చికిత్సలు అందించాల్సి ఉంది. అలాగే బరువు తక్కువగా ఉన్న చిన్నారులు 32 శాతం మంది జిల్లాలో పుడుతున్నారు. సాధారణంగా 2.50 కిలోల బరువు ఉండాల్సిన చిన్నారులు పౌష్టికాహార లోపం వల్ల కిలో కంటే తక్కువ బరువుఉన్న చిన్నారులకు తల్లులు జన్మనిస్తున్నారు. 19 శాతం మంది బక్కచిక్కిన చిన్నారులు పుడుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. 2.4 శాతం మంది ఊబకాయంతో పుడుతున్నారు. వీటన్నింటికి పౌష్టికాహా రం లోపమేనని వైద్య నిపుణులు చెబుతున్నారు.



పిల్లలకు పౌష్టికాహారం తప్పనిసరి

చిన్నారుల్లో ఎక్కువశాతం మరణాలకు పౌష్టికాహారం లోపమే కారణం. తక్కువ బరువు ఉన్న వారిని గుర్తించి వారికి ప్రత్యేక చికిత్స అందించాలి. లేందటే చిన్నారులు మృత్యువాత పడక తప్పదు. పప్పుధాన్యాలు, గింజధాన్యాలు, నూనె గింజలు, కూరగాయలు, ఆకుకూరలు, కాలానికి అనుగుణంగా దొరికే పండ్లు, గుడ్లు, పాలు. పెరుగు తప్పనిసరిగా తీసుకోవాలి.

- డాక్టర్ సర్దార్ సుల్తానా, జీజీహెచ్ చిన్నపిల్లల విభాగం హెచ్‌వోడీ



గర్భిణులు ఆహారం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

గర్భిణులు బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలి. రక్తహీనతకు గురయి ప్రసవ సమయంలో మృత్యువాత పడకుండా చూసుకోవాలి. యుక్త వయసు నుంచే పౌష్టికాహారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. పుట్టిన పిల్లలకు తల్లుపాలు సమృద్ధిగా అందించేలా చర్యలు తీపుకోవాలి. పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తప్పనిసరిగా అందించాలి.

- డాక్టర్ పల్లంరెడ్డి యశోధర, గైనకాలజీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు

లోపాన్ని అధిక మించాలంటే...

తల్లులు, పిల్లల్లో పౌష్టికాహార లోపాల్ని అధికమించాలంటే తృణధాన్యాలు, గింజ ధాన్యాలు, పప్పులు, కూరగాయలు, ఆకు కూరలు, పండ్లు, పాలు, పెరుగు, ఇతర పాల ఉత్పత్తులు తీసుకోవాలి. అలాగే గుడ్లు, చికెన్ వంటివి తీసుకోవాలి. ఐరన్, జింక్, అయోడిన్ తదితర ఖనిజ లవణాలు, విటమిన్-ఎ, బీ, సీ తదితర సూక్ష్మపోషకాలు సమృద్ధిగా ఉండే పదార్థాలు తప్పక తీసుకోవాలి.



పౌష్టికాహార లోపంతో జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న చిన్నారి

శ్రీధర్‌రెడ్డి వ్యవహారంలో దర్యాప్తు వేగవంతం

- ఇంటి పరిసరాల్లో సీసీ ఫుటేజ్‌ల పరిశీలన

నెల్లూరు(క్రైం), ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని హత్య చేస్తే డబ్బే డబ్బు.. అంటూ కొందరు రౌడీషీటర్లు మాట్లాడుకున్న వీడియోపై పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. ఇప్పటికే ఆ వీడియోలో ఉన్న వారందరినీ అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వారిని ఓ వైపు తమదైన శైలిలో విచారిస్తూనే, మరోవైపు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఇంటి పరిసరాల్లోని సీసీ ఫుటేజ్‌లను పోలీసులు సేకరించినట్లు తెలిసింది. వీడియోలో మాట్లాడుతున్న వారు శ్రీధర్‌రెడ్డి నివాసం చుట్టుపక్కల ప్రాంతాల్లో కొంతకాలంగా రెక్కీ నిర్వహించారా...? ఆ ప్రాంతాల్లో వారు తిరుగుతున్నట్లు ఎవరైనా గమనించారా...? అని పరిశీలించడంతోపాటు, స్థానికులను విచారిస్తున్నట్లు సమాచారం.ఈ వ్యవహారంపై పోలీసులు అన్నీ కోణాల్లోనూ దర్యాప్తు ప్రారంభించారు.

సివిల్ వివాదాలే ఎక్కువ !

- 4 వారాల్లో పోలీస్ గ్రీవెన్స్‌కు వచ్చిన అర్జీలు 368
- సివిల్‌వి 214.. 2వ స్థానంలో మహిళా ఫిర్యాదులు

నెల్లూరు (క్రైం), ఆగస్టు 31 (ఆం ధ్రజ్యోతి) : పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో (పీజీఆర్ఎస్, గ్రీవెన్స్) సివిల్ వివాదాల పరిష్కారం కోసం బాధితులు క్యూ కడుతున్నారు. భూమి, ఆస్తి, డబ్బులకు సంబంధించి, కోర్టులో జరుగుతున్న కేసులు, రెవెన్యూకు సంబంధించిన సివిల్ వివాదాలు పరిష్కరించాలంటూ ప్రతి సోమవారం నెల్లూరులోని ఎస్పీ కార్యాలయంలో జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు ప్రజలు తరలి వస్తున్నారు. గత నాలుగు వారాల గ్రీవెన్స్‌ను పరిశీలిస్తే అధిక సంఖ్యలో ఫిర్యాదులు సివిల్ వివాదాలపైనే ఉన్నాయి. రెండో స్థానంలో భర్త, అత్తింటి వారు వేధింపులు, భర్త చనిపోతే అత్తింటి వారు ఇబ్బందులకు గురి చేయడం, చెడువ్యసనాలకు బానిసలై భర్తలు వేధిస్తున్నారంటూ మహిళలు ఇచ్చే ఫిర్యాదులు ఉన్నాయి. ఇక మూడవ స్థానంలో పెట్టీ కేసులు, నాల్గవ స్థానంలో సైబర్, చీటింగ్ నేరాలు ఉన్నాయి. కనిపెంచిన బిడ్డలు వృద్ధాప్యంలో తిండి పెట్టకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ వస్తున్న ఫిర్యాదులు ఐదో స్థానంలో ఉన్నాయి.

4 వారాల్లో గ్రీవెన్స్‌కు వచ్చిన ఫిర్యాదులు

మొత్తం అర్జీలు	: 368
సివిల్ వివాదాలు	: 214
మహిళ ఫిర్యాదులు	: 67
పెట్టీ కేసులు	: 36
సైబర్, చీటింగ్	: 24
వృద్ధులు	: 15
బాడిలి అఫెన్స్	: 12



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణకాంత్ (ఫైల్)

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	120
స్కిన్ చికెన్	220
స్కిన్‌లెస్	242

కోడిగుడ్ల ధర (100) : 560

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9909
వెండి కిలో ధర	రూ. 123700
వెండి ఒక గ్రాము	రూ.126.70

క్రీడలతో మానసిక, శారీరక దారుఢ్యం: ఎమ్మెల్యే దగుమాటి

కావలి, ఆగస్టు31 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం లభిస్తుందని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. స్థానిక 16వ వార్డులోని చంద్రబాబునగర్ కాలనీ ఇండోర్‌లో ఏర్పాటు చేసిన వర్ష ఉడ్‌బ్యాడ్మింటన్ కోర్టును ఆదివారం ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులతో కలిసి సరదాగా బ్యాడ్మింటన్ ఆడారు. ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో క్రీడలు, వ్యాయామానికి కొంత సమయం కేటాయిస్తే ఆరోగ్య భాగ్యం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

3న రైతు సంఘాల సమన్వయ సమితి సమావేశం

కందుకూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కరేడులో ఇండోసోల్ సోలార్ కంపెనీ కోసం రాష్ట్రప్రభుత్వం చేపట్టిన బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా రైతులకు సంఘీభావంగా పోరాట కార్యాచరణ కోసం సెప్టెంబరు 3వ తేదీన కందుకూరులోని యూటీఎఫ్ కార్యాలయంలో రైతుసంఘాల సమన్వయ సమితి, ప్రజాసంఘాల ఐక్యవేదిక సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయా సంఘాల నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో రైతులు, కూలీలు, మేధావులు, వివిధ ప్రజాసంఘాల నేతలు, ప్రజాస్వామిక వాదులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కరేడులో పరిణామాలపై ఏడీబీకి ఫిర్యాదు

● ఆప్ నేత నేతి మహేశ్వరరావు

కందుకూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కరేడులో ఇండోసోల్ కంపెనీ నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న బలవంతపు భూసేకరణపై ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు (ఏడీబీ)కి ఫిర్యాదు చేయనున్నట్లు ఆమ్ ఆద్మీ పార్టీ కందుకూరు నియోజకవర్గ కన్వీనర్ నేతి మహేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక పరిశీలన, స్థానికుల ఆమోదం లేకుండా భూసేకరణ చేయటం ఏడీబీ నిబంధనలకు విరుద్ధమని, నిబంధనలు పాటించని సంస్థలకు ఏడీబీ రుణం ఇవ్వదని, అందుకే ఇక్కడి పరిస్థితులపై ఏడీబీకి ఫిర్యాదు చేయటం ద్వారా బలవంతపు భూసేకరణకు అడ్డుకట్ట వేసేందుకు మావంతు ప్రయత్నం చేస్తామన్నారు.

వెంకటరమణయ్య సేవలు ఎనలేనివి : ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో 42 సంవత్సరాల పాటు వివిధ హోదాలలో పనిచేసిన ఎస్ఐ ఎంవీ రమణయ్య సేవలు ఎనలేనివని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. కందుకూరు రూరల్ ఎస్ఐగా ఉద్యోగ విరమణ చేసిన రమణయ్యను ఆదివారం స్థానిక వెంగమాంబ ఫంక్షన్ హాలులో సబ్ డివిజన్‌లోని పోలీసు అధికారులు, సిబ్బందితోపాటు వివిధ పార్టీల నేతలు, రమణయ్య మిత్రులు ఘనంగా సత్కరించారు. డీఎస్పీ సీహెచ్‌వీ బాలసుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ రమణయ్య కందుకూరు ప్రాంతంలోని వివిధ పోలీసుస్టేషన్‌లలో సేవలందించాడని కొనియాడారు.

నిమజ్జనానికి తరలిన గణనాథులు



వేంకటేశ్వరస్వామి, గణనాథుడి విగ్రహాలతో ఆకట్టుకుంటున్న సెట్టింగ్



కావలి(టౌన్)ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణంలోని కలుగోళశాంభవీ దేవి ఆలయ ప్రాంగణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలలు వైభవంగా జరుగు తున్నాయి. కమిటీ అధ్యక్షుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్ విజయలక్ష్మీ దంపతుల పర్యవేక్షణలో 9 రోజుల ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సింగపేటకు చెందిన శిల్పి శేషాచార్యులు 22 అడుగుల గణనాథుని ప్రతిమను అద్భుతంగా తీర్చిదిద్దారు. మండపం చుట్టూ వివిధ దేవతా మూర్తుల ప్రతిమలు, ప్రత్యేక సెట్టింగులో ఏర్పాటు చేయడంతో ప్రాంగణమంతా భక్తిపారవశ్యంతో పులకిస్తోంది. ప్రఖ్యాత కళాకారులచే ప్రతిరోజు రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు భక్తజనానికి కనువిందు చేస్తున్నాయి. రాత్రి 8 గంటలకు తియ్యబండి కళ్యాణ్ ఆచార్యుల బృందంచే నిర్వహిస్తున్న దశ హారతుల కార్యక్రమంలో పాల్గొని భక్తులు తన్మయం చెందుతున్నారు. ప్రత్యేక అర్చనలతో ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. భక్తులు వేలాదిగా తరలివచ్చి గణనాథుని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్నారు.

కావలి రూరల్: వినాయక చవితి వేడుకల్లో భాగంగా ప్రత్యేక పూజల అనంతరం వినాయకులను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో డప్పులు, డీజే మోతల మధ్య ఘనంగా ఊరేగించారు. మండలంలోని తుమ్మలపెంట, కొత్తసత్రం, చెన్నాయపాలెం సముద్ర తీరంలో ఆదివారం వినాయక నిమజ్జన వేడుకలు కోలాహలంగా నిర్వహించారు. సముద్ర తీరం భక్తులతో కిటకిటలాడింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా డీఎస్పీ శ్రీధర్ ఆదేశాల మేరకు రూరల్ సీఐ రాజేశ్వరరావు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. రద్దీ ఎక్కువగా ఉండడంతో వినాయక విగ్రహాలున్న వాహనాలను మాత్రం తీరం వెంట పంపించి, మిగిలిన వాహనాలను బంకింగ్ హోమ్ కెనాల్ వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ పాయింట్‌లో ఉంచారు. తుమ్మలపెంట తీరంలో పోలీస్ అవుట్ పోస్టు, ఫెడ్ లైట్లు ఏర్పాటు చేసి పోలీసులు భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు. రూరల్ ఎస్ఐలు తిరుమల రెడ్డి, బాజీబాబు, సిబ్బంది, మెరైన్ ఎస్ఐ జానకీరామ్, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

వినాయకుడికి ఎమ్మెల్యే ఇంటూరి పూజలు



కందుకూరులోని వాసవీ గ్రంథాలయం వినాయక మండపం వద్ద పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తదితరులు

కందుకూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలుచోట్ల వినాయక విగ్రహాల వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరిం చారు. పట్టణంలోని వాసవీ గ్రంధాలయంలో కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. కార్యక్రమంలో మురారిశెట్టి వెంకటసుబ్బారావు, కొత్త వెంకటేశ్వర్లు, కొత్తూరి వెంకటసుధాకర్, కాకుమాని ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని దూబగుంట గ్రామంలో వినాయక మండపంలో ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో అత్తంటి నాగేంద్రరావు, అత్తంటి శ్రీహరినాయుడు, అత్తంటి మధు, గుండవరపు లక్ష్మీనరసింహ్మం తదితరులు పాల్గొన్నారు.

కలిగిరి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): గత ఐదు రోజులుగా పలు గ్రామాలలో భక్తుల పూజలందుకున్న గణేశ్ విగ్రహాలు ఆదివారం నిమజ్జనానికి తరలి వెళ్ళాయి. వినాయక మండపాల నుండి గ్రామాల్లో స్వామికి గ్రామోత్సవం నిర్వహించారు. కలిగిరి పట్టణంలోని పాతూరు మహిళలు గ్రామోత్సవంలో ప్రదర్శించిన కోలాటం పట్టణవాసులను అలరించింది. మేళతా ళాలు, డీజేల మోతలతో రంగులు చల్లు కుంటూ సముద్రతీరానికి తీసుకెళ్ళి నిమజ్జనం చేశారు.

లింగసముద్రం: వినాయక చవితి సందర్భంగా మండలంలోని పలు గ్రామాలలో ఏర్పాటుచేసిన విగ్రహా లను ఆదివారం నిమజ్జనం చేశారు. మండలంలోని పెద పవని, ముత్యాలపాడు, యర్రారెడ్డి పాలెం, తిమ్మారెడ్డిపాలెం, మాలకొండ రాయుని పాలెం, లింగసముద్రం, వీఆర్ కోట, గంగ పాలెం, వీఆర్ కోట, పెంట్రాల, అన్నెబోయిన పల్లి, చీమలపెంట గ్రామాలలో విగ్రహాలను ఆయా గ్రామాలలోని చెరువులు, రాళ్లపాడు ప్రాజెక్టు, రామాయపట్నం వద్ద సముద్రంలో నిమజ్జనం చేశారు.

గణనాథుడికి 108 రకాల నైవేద్యం

● 'మెతుకు' కుటుంబానికి రూ. 45 వేలకు స్వామి వారి లడ్డూ



గణనాథుడికి అర్పించిన 108 రకాల ప్రసాదాలు

బిట్రగుంట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో వినాయకచవితి వేడుకల్లో భాగంగా ఆదివారం నిమజ్జనోత్సవం వైభవంగా జరిగింది. బోగోలు విజయ గణపతి ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన గణనాథునికి స్థానిక భక్తులు 108 రకాల ప్రసాదాలను నైవేద్యంగా అందజేశారు. భక్తులు పోటాపోటీగా రు. వినాయకస్వామి వద్ద ఉంచిన లడ్డు ప్రసాదాని వేలం పాటలో మెతుకు రాజేశ్వరి కుటుంబ సభ్యులు రూ. 45 వేలకు సొంతం చేసుకున్నారు. కమిటీ సభ్యులు సాంప్రదాయక లడ్డును మెతుకువారి కుటుంబానికి చేర్చారు. అనంతరం బోగోలు యాదవపాలెం, చెంచులక్ష్మీపురం, నాగులవరం, తాళ్ళూరు, బిట్రగుంట తదితర గ్రామాల నుంచి వినాయక విగ్రహాలను ఆనందోత్సాహాల మధ్య ఊరేగించి నిమజ్జనం చేశారు. జరిగాయి. ఎస్సీ పాలెంలో ఆక్వా రైతులు ఏర్పాటు చేసిన గణేశ్ విగ్రహాన్ని తెల్లవారుజామున నిమజ్జనం చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

జమునకు 'తెలుగు తేజం' పురస్కారం



పురస్కారం అందుకుంటున్న కవయిత్రి జమున

కావలి(టౌన్) ఆగస్టు31 (ఆంధ్రజ్యోతి): కావలికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయిని, కవయిత్రి ఎం జమునకు 'తెలుగు తేజం' అవార్డు లభించింది. ఆదివారం పల్నాడు జిల్లా నర్స రావుపేటలోని భువనచంద్ర టౌన్‌హాల్‌లో శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి జయంతి సభ నిర్వహిం చారు. ముఖ్య అతిథి, ఎమ్మెల్యే చదలవాడ అరవింద్, శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ సీఈవో కత్తిమండ ప్రతాప్ చేతుల మీదుగా జమున ఈ పురస్కారాన్ని అందుకున్నారు. తెలుగు భాషాభి వృద్ధికి జమున చేసిన కృషికి ఈ అవార్డు లభించడం హర్షణీ యమని పలువురు కళాకారులు, కవులు ఆమెను అభినందించారు.

వినాయకుడి లడ్డూ వేలం

లింగసముద్రం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగళాపురంలో రెండు వినాయకుని విగ్రహాల మండపాల వద్ద ఆదివారం వినాయకుడి లడ్డు వేలంపాట నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలోని పాఠశాల వద్ద నిర్వహించిన వేలంలో గ్రామానికి చెందిన కనకం వెంకటేశ్వర్లు రూ.40 వేలకు లడ్డు దక్కించుకున్నారు. అలాగే గ్రామంలోని మిట్టపాలెం వద్ద నిర్వహించిన వేలంలో వెలుగు వీరాంజనేయులు రూ. 95వేలకు లడ్డును దక్కించుకున్నారు. ఈ సందర్భంగా మండపాల వద్ద నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నేటి నుంచి ఆధార్ నమోదు ప్రారంభం

బిట్రగుంట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండల పరిధిలోని షెడ్యూల్ తెగల వారికి సెప్టెంబరు 1 నుంచి 6 వ తేదీ వరకు ఆధార్ నమోదుతో పాటు, మార్పులు, చేర్పుల ప్రక్రియ కోసం ప్రత్యేక శిబిరాన్ని నిర్వహిస్తునట్లు ఎంపీడీవో సుబ్రహ్మణ్యం ఆదివారం తెలిపారు.

అనివేటి మండపం నిర్మాణానికి విరాళాలు

కందుకూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కందుకూరు గ్రామదేవత అంకమ్మ ఆలయం అనివేటి మండపం నిర్మాణానికి ఆదివారం భక్తులు విరాళాలు అందజేశారు. దివి కోటేశ్వరరావు, అనూరాధ దంపతులు రూ. 25వేలు, పొన్నూరు వెంకటమోహనరావు, వెంకటసుజాత దంపతులు రూ. 5వేలు విరాళంగా ఆలయ కమిటీ సభ్యులు పిడికిటి వెంకటేశ్వర్లు, మంచిరాజు మురళిలకు అందజేశారు.

దామిశెట్టి క్రీడా ప్రతిభా అవార్డుల ప్రదానం

కావలి(టౌన్)ఆగస్టు(ఆంధ్రజ్యోతి) స్థానిక మద్దూరుపాడులోని డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం ప్రతిభావం తులైన క్రీడాకారులకు దామిశెట్టి క్రీడా ప్రతిభా అవార్డులు ప్రదానం చేశారు. కళాశాల కార్యదర్శి బాలసురేష్‌బాబు, కరస్పాండెంట్ సుధీర్‌నాయుడులు మాట్లాడుతూ డీబీఎస్ వ్యవస్థాపకులు, తమ తండ్రి దివంగత దామిశెట్టి శ్రీనివాసులు నాయుడు గొప్ప క్రీడా పోషకులని గుర్తు చేసుకున్నారు. ఆయన జ్ఞాపకార్థం ప్రతిఏటా ప్రతిభావంతులైన క్రీడాకారులకు దామిశెట్టి క్రీడా ప్రతిభా అవార్డులు అందజేస్తున్నా మన్నారు. కార్యక్రమంలో పీడీ శివసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి జిల్లా ఏర్పాటుకు మద్దతివ్వండి

● వెంకయ్యనాయుడికి జిల్లా సాధన సమితి నాయకుల వినతి



వెంకయ్యనాయుడికి వినతిపత్రం అందచేసిన జిల్లా సాధన సమితి నాయకులు

ఉదయగిరి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): అన్నిరంగాల్లో వెనుకబడి ఉన్న ఉదయగిరిని జిల్లాగా చేసేందుకు మద్దతివ్వాలని భారత పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడును ఆదివారం మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డితో కలిసి జిల్లా ఉద్యమ నేతలు స్వరభారత్ ట్రస్టులో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జిల్లా, డివిజన్, మండలాల పునర్వ్యవస్థీకరణ కోసం మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించి ప్రజాభిప్రాయం సేకరిస్తున్న సందర్భంగా నేతలు ఆయన్ను కలిశారు. రెండు పర్యాయాలు ఉదయగిరి ఎమ్మెల్యేగా పనిచేసిన వెంకయ్యనాయుడికి ఇక్కడి స్థితిగతులన్నీ అవగాహన ఉన్నందున జిల్లా చేసేందుకు మద్దతివ్వాలని కోరామన్నారు. నియోజకవర్గం అభివృద్ధి బాట పట్టాలంటే జిల్లా చేయడం ఒక్కటే మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాధన సమితి నాయకులు షేక్‌ఎండీ ఖాజా, పాముల రమణయ్య, ఎల్‌సీ రమణారెడ్డి, మూలె బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

వింజమూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి నియోజకవర్గంలోని దుత్తలూరు మండలాన్ని మినహాయించి ఏడు మండలాలకు సంబంధించిన 39 మంది బాధితులకు సుమారు రూ.50లక్షల సీఎం సహాయ నిధి చెక్కులను ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదివారం పంపిణీ చేశారు. వింజమూరులోని తెలుగుదేశం ప్రధాన పార్టీ కార్యాలయంలో మండల నాయకులతో కలిసి బాధితులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నారన్నారు. ఉదయగిరి నియోజకవర్గ అభివృద్ధికి అందరూ తోడ్పాటును అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్లు గూడా నరసారెడ్డి, సీహెచ్ బయన్న, మధుమోహన్‌రెడ్డి, వింజమూరు సొసైటీ ఛైర్మన్ చల్లా వెంకటేశ్వర్లుయాదవ్, సీనియర్ నాయకులు పోలుబోయిన చంద్రబాబునాయుడు, యారవ కిష్టయ్య, సర్పంచ్ పీవీ నాయుడు, బొల్లినేని వెంకటరామారావు, మంచాల శ్రీనివాసులునాయుడు, ఏగినేని శ్రీనివాసులునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కాకర్లను సన్మానించిన సొసైటీ పాలకవర్గం

ఉదయగిరి : స్థానిక కొట్టాలపల్లి సొసైటీ పాలకవర్గం ఆదివారం వింజమూరు టీడీపీ ప్రధాన కార్యాలయంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను సన్మానించి కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు గడ్డం వెంకటసామయ్య, డైరెక్టర్లు బొజ్జా నరసింహారావు, నల్లిపోగు రాజా, మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, టీడీపీ నాయకులు బొజ్జా నరసింహులు, నల్లిపోగు నరసింహా, జాఫర్‌మొహిద్దీన్, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల వైద్యఖర్చులకు ఆర్థిక సాయం

ఉదయగిరి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పసముద్రం గ్రామంలో వినాయక నిమజ్జనోత్సవం సందర్భంగా బాణసంచా పేలి తీవ్ర గాయాలపాలై వైద్యశాలలో చికిత్స పొందుతున్న చిన్నారులను ఆదివారం మాజీ ఎంపీపీ, వైసీపీ రాష్ట్ర ప్రచార కమిటీ ఉపాధ్యక్షుడు చేజర్ల సుబ్బారెడ్డి పరామర్శించి వైద్యఖర్చుల నిమిత్తం ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ బాలిబోయిన శ్రీనివాసులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వినాయక నిమజ్జనోత్సవం



సంగం: బాలగణేశుడి విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు



సీతారామపురం : బొజ్జ గణపయ్య నిమజ్జనోత్సవంలో పాల్గొన్న భక్తులు

సంగం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలో ని పలు గ్రామాల్లో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాలను ఆదివారం పెన్నానదిలో నిమజ్జనం చేశారు. మండలంలోని ఉడ్‌హౌస్‌పేటలో ఏర్పాటు చేసిన బాలగణేశుడిని గ్రామోత్సవం నిర్వహించిన అనంతరం యువకులు సంగం పెన్నానదిలో నిమజ్జనం చేశారు. అదేవిధంగా సంగం రాళ్లచెలిక వీవర్స్ కాలనీ, ఎస్టీ కాలనీ, సాయినగర్, కొత్తూరు తదితర ప్రాంతాల్లో విగ్రహాలను నిమజ్జనం చేశారు.

● **ఉదయగిరి:** వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉదయగిరి పట్టణంలోని పలు వీధుల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలతోపాటు మండలంలోని గంగిరెడ్డిపల్లి, గండిపాళెం, దేకూరుపల్లి తదితరగ్రామాల్లో ఏర్పాటుచేసిన విగ్రహాలను మేళతాళాలు, బాణసంచా పేలుళ్ల నడుమ నిమజ్జనానికి తరలించారు. పలు మండపాల వద్ద లడ్డూల వేలంపాట నిర్వహించడంతో భక్తులు పోటీలు పడి దక్కించుకున్నారు. ఉట్టి మహోత్సవం అనంతరం విగ్రహాలను సమీపంలో ఉన్న నీటి వనరుల్లో నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

● **సీతారామపురం:** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని అన్ని గ్రామాల్లో కొలువుదీరిన వినాయక విగ్రహాలు ఆదివారం నిమజ్జనానికి తరలాయి. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని కోటవీధి పోతురాజు వద్ద, పరమటివీధి, రాజుగారి వీధి, బెస్తకాలనీ, తోట కాలనీలలో ఏర్పాటుచేసిన విగ్రహాల వద్ద లడ్డూ వేలపాట నిర్వహించారు. అలాగే యువత ఉట్టి ఉత్సవంలో పాల్గొన్నారు. అనంతరం గణనాథుడి నిమజ్జనోత్సవం నిర్వహించారు. నిమజ్జనోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సీఐ వెంకట్రావు, ఎస్సై శివకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది విధులు నిర్వహించారు. మండలంలోని పలు ప్రాంతాలలో వినాయక మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటుచేశారు.

శాకాహారంపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న పిరమిడ్ స్పిరిచ్చువల్ సొసైటీ సభ్యులు

సంగం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆనంద్ సామ్రాజ్యం పిరమిడ్ ధ్యాన కేంద్రం రెండవ వార్షికోత్సవ సప్తాహం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో శాకాహారంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ స్థానిక వెంకయ్యస్వామి ఆలయం నుంచి రాజరాజేశ్వరిదేవి ఆలయం వరకు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ మాంసాహారం వదిలి ప్రతి ఒక్కరూ శాఖాహారం వైపు మొగ్గు చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆనంద్ సామ్రాజ్యం పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వాలు



జెండా ఆవిష్కరిస్తున్న రైతు సంఘం నాయకులు

ఉదయగిరి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు పులిగండ్ల శ్రీరాములు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో 5వ ఏరియా రైతుసంఘం మహాసభ నిర్వహించారు. తొలుత జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పరిశ్రమల పేరుతో బలవంతపు భూసేకరణ సరికాదన్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్ పూర్తిచేసి సీతారాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి తాగు, సాగునీటి కష్టాలు తీర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాకు వెంకటయ్య, ఎంపీటీసీ విజయమ్మ, మట్టి హరినారాయణ, పావులూరి నాగేశ్వరరావు, పచ్చవ వెంకటేశ్వర్లు, కోడె రమణయ్య, పందిళ్ల వెంకటేశ్వర్లు, నాయబ్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా తొమ్మిది మంది సభ్యులతో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు వారిలో అధ్యక్ష, కార్యదర్శులుగా పచ్చవ వెంకటేశ్వర్లు, కాకు వెంకటయ్యలతోపాటు మరో ఏడుగురు సభ్యులను ఎంపిక చేశారు.

ఉపాధ్యాయుడి మృతికి సంతాపం

ఉదయగిరి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు నల్లబోతుల వెంకటరమణ(44) ఆదివారం మృతిచెందారు. దుత్తలూరు మండలం నందిపాడు గ్రామానికి చెందిన వెంకటరమణ అనారోగ్యానికి గురికావడంతో కుటుంబ సభ్యులు చెన్నైలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పాఠశాల ఇన్‌చార్జి, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు గుంటుపల్లి శ్రీనివాసరావు, షేక్ షరీఫ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు వెంకటరమణ మృతదేహాన్ని సందర్శించి సంతాపం వ్యక్తంచేశారు.

నాగారపమ్మకు పూజలు



నాగారపమ్మను దర్శించుకుంటున్న భక్తులు

సంగం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్ల పెన్నానది ఒడ్డున ఉన్న పురాతన నాగారపమ్మదేవి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా పెన్నానది జలాలు, క్షీర, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన మహిళా భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పోలేరమ్మకు పొంగళ్లు



పొంగళ్ల సామగ్రితో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

ఉదయగిరి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుర్రపల్లి బీసీ కాలనీలో ఆదివారం గ్రామదేవత పోలేరమ్మకు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా పొంగళ్ల సామాగ్రితో గ్రామ పురవీధుల్లో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం పొంగళ్లు నిర్వహించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా దొరసానమ్మ గంధ మహోత్సవం

ఏఎస్ పేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక హజరత్ సయ్యద్ ఖాజా రహమతుల్లా నాయబ్ రసూల్ దర్గా హబీబాఖాతూన్ (దొరసానమ్మ) గంధ మహోత్సవంలో భాగంగా ఆదివారం దర్గా తాత్కాలిక సజ్జాద ఎస్‌జీఎన్ ఫయాజ్ అహ్మద్ నివాసంలో గంధం దంచే కార్యక్రమం నిర్వహించగా మహిళా భక్తులు గంధం దంచారు. అనంతరం గంధానికి సుగంధ తైలాలు కలిపి గంధ కలశంలో అర్ధరాత్రి దర్గాకు తరలించి సమాధులకు లేపనం చేశారు.